www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 128 మంగళవారం, సెప్టెంబర్ 22, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## తెలంగాణ మలిదశ ఉద్యమంలో
# కీలక పాత్ర

- లింగాల కేదారి, పుష్పలత సేవలు మరువలేనివి
- వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన లింగాల కేదారి, ఆయన భార్య పుష్పలత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత అంకితభావంతో అందించిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. కేదారి దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ, సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. హనుమకొండలోని శాంతినగర్, పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న విషాదకర సంఘటనలో మరణించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ నుంచి సీఎం ఓఎస్డీ రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. మండల రాజు కుటుంబానికి రూ.5 లక్షల సాయంతెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ

మిగతా2లో...



## పార్టీ శ్రేణుల అణచి వేతకు
# రాష్ట్ర సర్కారు కుట్ర

- ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం
- మేం తప్పులు చేస్తే చర్యలు తీసుకోవచ్చు
- సిరిసిల్లలో 8 వేల ఎకరాలు? కబ్జా చేసిందెవరు? : బీఆర్ఎస్ నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన
- జూరాలలో నీళ్లున్నా ఎందుకు విడుదల చేయటం లేదు?
- ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం : నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :** జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వరద జలాలపై కట్టిన ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నీరు తీసుకెళ్తుంటే ఇక్కడ నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల కింద కూడా నీరు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ఏడాది వచ్చిన 248 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణ

మిగతా2లో...

# 'దానం' పిటిషన్ విచారణకు అనుమతి

## - రేపు సుప్రీంకోర్టులో విచారణ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 :** దానం నాగేందర్ పిటిషన్ విచారణకు అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. తెలంగాణ హైకోర్టు అనర్హత ఆదేశాల నేపథ్యంలో ఉప ఎన్నిక నోటిఫికేషన్‌పై ఆందోళనగా ఉందని దానం నాగేం దర్ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి సుప్రీంకోర్టుకు నివేదించారు. అందువల్ల ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. పార్టీ ఫిరాయించారన్న కారణంతో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పును ఈనెల 19న దానం నాగేందర్ సుప్రీంకోర్టులో

మిగతా2లో...

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు
# హైకోర్టు నోటీసులు

## - స్పీకర్‌ను దూషించారన్న ఆరోపణల కేసులో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను దూషించారన్న ఆరోపణలతో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్ కుమార్‌రెడ్డిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్‌ను తిరస్కరిస్తూ ఈనెల ఎనిమిదిన కింది కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఏసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మధుసూదన్ రావు సోమవారం విచారించారు. పీపీ వాదిస్తూ స్పీకర్ కులం తెలిసేలా కావాలనే అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలను రిమాండ్‌కు పంపేందుకు మెజిస్ట్రేట్ నిరాకరించడం చట్ట వ్యతిరేకమన్నారు. పలువురు సాక్షుల వాంగ్మూలాలతోపాటు

మిగతా2లో...

## కేసీఆర్ హయాంలో ఆంధ్ర ప్రాజెక్టులకు మేలు : జూపల్లి కృష్ణారావు




**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

మిగతా2లో...

## ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దాలి: మంత్రి సీతక్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :** ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో మంత్రి సీతక్క ఈరోజు (సోమవారం) ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది చేపట్టాల్సిన పనుల ప్రణాళికపై సమీక్షించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో తీవ్రత అందరికీ తెలుసునని.. ఈ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. **రూ.50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నాం..** అక్టోబర్ 2వ తేదీన

మిగతా2లో...



# జూరాల వద్ద హైటెన్షన్

- సాగునీటి కోసం రైతుల ఆందోళన
- ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం యత్నం, అరెస్ట్
- ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్
- డ్యాం చుట్టూ పోలీస్ పహారా
- గులాబీ నేతలు వర్సెస్ పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట
- రైతుల నిరసనకు మద్దతుగా బీఆర్ఎస్ ధర్నా, హౌస్ అరెస్టులు

**ఆత్మకూరు, సెప్టెంబర్ 21 :** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. జూరాల డ్యాం ముట్టడికి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. రైతుల ఆందోళనకు మద్దతుగా జూరాల డ్యాంపై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో పోలీసులు

మిగతా2లో...

## సోనియా గాంధీకి
# ఢిల్లీ కోర్టు షాక్

- పౌరసత్వం కేసులో దర్యాప్తునకు ఆదేశాలు
- పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే ఎన్నికల జాబితాలో సోనియా పేరు ఉందని ఆరోపణలు
- గతంలో దీనిపై దర్యాప్తును తిరస్కరించిన మేజిస్ట్రేయల్ కోర్టు
- తాజాగా దాన్ని కొట్టివేస్తూ ఆదేశాలు



2లో

# పార్టీ శ్రేణుల అణచి వేతకు రాష్ట్ర సర్కారు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

కేవలం 28 టీఎంసీలు మాత్రమే వాడిందని వివరించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు మొదటి శత్రువులా తయారయ్యారని అన్నారు. ఎల్‌నినో తరహాలో ఎల్ కాంగో వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. రైతుల కోసం వెళ్లిన బీఆర్ఎస్ నేతలను దుర్మార్గంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో భయటపెట్టలేరని అన్నారు. జూరాల కింద ఒక్క ఎకరం పంట ఎండినా కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుడతామనీ, ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాలు కాకుండా రైతుల ప్రయోజనాలు ముఖ్యం కావాలని సూచించారు. రైతుల విషయంలో రాజకీయం చేయొద్దని కోరారు. కన్నేపల్లి, నార్లాపూర్ పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి పది టీఎంసీల నీరు తీసుకొచ్చి పంటలను కాపాడాలని చెప్పారు. తాము ఏమైనా తప్పులు చేసి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు అయినా తీసుకోవచ్చని అన్నారు. డ్రామాలు తగవనీ, భూముల వద్దకు వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని సవాల్ చేస్తే ఇప్పటి వరకు కనీసం స్పందన లేదని అన్నారు. సిరిసిల్ల వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చెప్తారని ప్రశ్నించారు. నేతన్నల ఆత్మహత్యలు, రైతుబంధు ఎగ్గొట్టింది వివరిస్తారా? అని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో చేసిన అభివృద్ధిని చూసి కొడంగల్‌లో అమలు చేసేందుకు వస్తున్నారేమోనని అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సిరిసిల్లలో ఎనిమిది వేల ఎకరాల భూమిని ఎవరు కబ్జా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పుడు ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజన్న దర్శనం చేసుకుని పాప ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు.

### పలువురి చేరిక

తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గం జాఫర్ ఘడ్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానిక బీఆర్ఎస్ నేతలు యాస జితేందర్ రెడ్డి, తాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, యాస సందీప్ రెడ్డి, చిడిమిల్ల మధు రెడ్డి పాల్గొన్నారు.

# ‘దానం’ పిటిషన్ విచారణకు అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

సవాల్ చేశారు. ఈ అనర్హత పిటిషన్‌పై విచారణ జరపాలని దానం నాగేందర్ తరపు ముకుల్ రోహిత్గి సోమవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. స్పీకర్ అనర్హత పిటిషన్‌ను తిరస్కరించగా, తెలంగాణ హైకోర్టు విచారించి అనర్హతా వేటు వేసిందని వివరించారు. ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని అందువల్ల అత్యవసరంగా విచారించాలని కోరారు. ‘రేపటి విచారణ జాబితాలో అత్యవసరంగా విచారించాలని కోరుతున్నాను. గత శుక్రవారం తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఇదే విషయంలో దానం నాగేందర్ పై పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌ను స్పీకర్ తిరస్కరించారు. దానం నాగేందర్ తన పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు. కానీ.. పార్టీతో సంబంధం లేని వ్యక్తి (బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్) ఈ పిటిషన్ ను వేశారు’ అని ధర్మాసనానికి నివేదించారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లోని అనర్హతకు సంబంధించినదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం, స్పీకర్ ఖైరతాబాద్ ఖాళీ అని నోటిఫై చేస్తే ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసే ఆస్కారం ఉందన్నారు. అందువల్ల పిటిషన్‌ను నేడు (మంగళవారం) విచారణ చేపట్టాలని కోరారు. ప్రతివాదుల తరపు న్యాయవాదులు కూడా కోర్టు హాల్‌లోనే ఉన్నారని నివేదించారు. దీనిపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలాని స్పందిస్తూ, రేపు (బుధవారం) ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. అన్ని వైపుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, బుధవారం ఈ పిటిషన్‌ను విచారిస్తామని తెలిపింది. అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న తాను 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినందుకు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని పేరా 2(1)(ఎ) రెడ్ విత్ ఆర్టికల్ 191(2)కింద తనను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎమ్మెల్యే అనర్హత విషయంలో స్పీకర్ తీసుకొనే నిర్ణయా లను న్యాయ స్థానాలుసమీక్షించడానికి వీలులేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ఉద్యోగ సంఘాల చర్చల్లో ప్రతిష్టంభన

## సీఎస్‌తో ఉద్యోగ సంఘాల భేటీ

## ప్రధాన డిమాండ్లు ప్రస్తావించిన సంఘాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :** రాష్ట్ర ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాల చర్చలు వాయిదా పడ్డాయి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అందుబాటులో లేకపోవడంతో మంగళవారం సాయంత్రం 6 గంటలకు సమావేశమవుదామని ఉద్యోగ సంఘాల నాయకులకు సీఎస్ సంజయ్ జాజు వెల్లడించారు. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లు ఆర్థికపరమైన అంశాలు కావటంతో భట్టి విక్రమార్కతో చర్చించాలని ఇరువురు భావిస్తున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎస్ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ప్రధానంగా నాలుగు డిమాండ్లపై వారు చర్చించారు. సమావేశం ప్రారంభం కాగానే తొలుత నూతన ఉద్యోగ ఆరోగ్య పథకంపై చర్చించారు. దాదాపు ఒక గంటపాటు అదే అంశంపై చర్చించడంతో ఉద్యోగ సంఘాల నేతలు మిగిలిన అంశాలను కూడా చర్చించాలని కోరారు. పీఆర్సీని అమలు చేయాలనీ, పెండింగ్ ఉన్న డీఏల మంజూరు, ఉద్యోగులకు, పెన్షనర్లకు పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు ప్రతి నెల రూ. 2,000 కోట్లు కేటాయించడం, అందులో 50 శాతం ఉద్యోగులకు, 50 శాతం పెన్షనర్లకు చెల్లించాలని నేతలు కోరారు. అదే విధంగా సీపీఎస్ రద్దు, 2003 డీయస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్లను ముందుకు తెచ్చారు. దీనిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లి మరోసారి రాత్రి 7.30 గంటలకు చర్చిద్దామని సీఎస్ కోరారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలు మరోసారి సమావేశానికి సిద్ధమవగా, డిప్యూటీ సీఎం అందుబాటులో లేని కారణంగా చర్చలను నేటి సాయంత్రం 6 గంటలకు వాయిదా వేసినట్టు సీఎస్ సమాచారాన్ని అందజేశారు. సీఎస్ సమావేశం సందర్భంగా సీపీఎస్ రద్దు విషయంలో ఎనిమిది అధికారులతో కమిటీ వేయనున్నట్టు సూత్రప్రాయంగా వెల్లడించినట్టు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. నెలాఖరు లోగా పీఆర్సీ రిపోర్ట్ ను తెప్పించుకుంటానని సీఎస్ వెల్లడించారని తెలిపారు. ఈ సమావేశంలో టీఎన్జీవోస్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవోస్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, పీఆర్టీయూ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, టీఎన్జీవో, టీజీవో ప్రధాన కార్యదర్శులు ముజీబ్, బి.శ్యాం, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, జేఏసీ నాయకులు మధుసూదన్ రెడ్డి, కృష్ణమూర్తి, కస్తూరి వెంకటేశ్వర్లు, సోమయ్య, పి.వెంకటరెడ్డి, అబ్దుల్లా, కటకం రమేశ్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

# బీమా రంగంలోనూ యూపీఐ

## - పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీకి ఐఆర్‌డీఏఐ కసరత్తు

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 21 :** భారత బీమా రంగంలో సమూల మార్పులు తెచ్చేందుకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ప్రయత్నాలు ముమ్మరం చేసింది. డిజిటల్ పేమెంట్స్ రంగంలో యుపిఐ సంచలనం సృష్టించినట్లే.. బీమా రంగంలోనూ పారదర్శకతను పెంచేందుకు ప్రతిపాదిత పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీ (పీఐఆర్) తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఐఆర్‌డీఏఐ ఇటీవల ఒక సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. పాలసీదారులకు అన్ని బీమా వివరాలు ఒకే చోట లభించడం, సులభంగా కేవైసీ పూర్తి చేయడం, క్లెయిమ్ చరిత్ర అందుబాటులోకి రావడం వంటి ప్రయోజనాలు ఈ వ్యవస్థ ద్వారా చేకూరుతాయి. జీ-20 డీపీఐ మార్గదర్శకాల ఆధారంగా రూపొందిస్తున్న ఈ ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్ విధానం వల్ల డేటా భద్రతకు




ఎటువంటి భంగం కలగకుండా పాలసీదారులకు, బీమా సంస్థలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ వ్యవస్థ ద్వారా సమాచారమంతా ఒకే చోట కేంద్రీకృతం కాకుండా డేటా ఎక్కడ సేకరించబడిందో అక్కడే సురక్షితంగా ఉండేలా ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్‌ను అవలంబిస్తున్నారు. దీని ద్వారా పాలసీదారులకు జీవిత, ఆరోగ్య, మోటార్, ఆస్తి బీమాలకు సంబంధించిన అన్ని పాలసీల వివరాలు ఒకే చోట కనిపిస్తాయి. నామినీలు, రెన్యూవల్స్, క్లెయిమ్‌లు సులభంగా పర్యవేక్షించవచ్చు. పాలసీల మార్పిడి (పోర్టబిలిటీ) మరింత సులభమవుతుంది. బీమా కంపెనీలకు పాలసీలు, క్లెయిమ్ చరిత్ర పారదర్శకంగా లభించడం వల్ల అండర్‌రైటింగ్ ఖచ్చితత్వం పెరుగుతుంది. మోసాలను అరికట్టడానికి వీలవుతుందని ఐఆర్‌డిఎఐ వర్గాలు భావిస్తున్నాయి. బ్యాంకులు, ప్రభుత్వాలకు కూడా వెరిఫైడ్ కవరేజ్ డేటా అందుబాటులోకి రావడం వల్ల రుణాల మంజూరు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభమవుతుంది. ప్రస్తుతం బీమా రంగంలో పాలసీదారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకే వ్యక్తి వివిధ బీమా సంస్థల నుంచి పాలసీలు తీసుకున్నప్పటికీ ప్రతిసారీ కేవైసీ ప్రక్రియను విడివిడిగా పూర్తి చేయాల్సి వస్తోంది. అలాగే, క్లెయిమ్ చరిత్ర అందుబాటులో లేకపోవడం వల్ల అండర్‌రైటింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. అంతేకాకుండా వినియోగదారులు తమకు నచ్చిన బీమా పాలసీని సులభంగా పోల్చుకునే అవకాశం లేక, ఏజెంట్లు చెప్పే మాటల మీదే ఆధారపడాల్సి వస్తోంది. ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరోను పూర్తిగా ఐఆర్‌డీఏఐ యాజమాన్యంలోని లాభాపేక్ష లేని సంస్థగా పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదించారు.

# సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 21** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేండ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది. ఈ పిటిషన్ను తిరిగి విచారణ చేపట్టాలంటూ ఢిల్లీ కోర్టు సోమ వారం ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వును సరైన వివరణ లేనిదిగా పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దానిని కొట్టివే శారు. రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అడ్వకేట్ వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్ను దాఖలు చేశారు. “భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 175(3)ను పాటిం చకపోవడం, ముఖ్యంగా సంబంధిత పోలీస్ అధికారి వాదనలు వినకపోవడం, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్ట్ తెప్పిం చకపోవడం వంటి కారణాల వల్ల సదరు ఉత్తర్వు లో చట్టపరంగా స్పష్టమైన లోపం ఉంది. చట్టం ప్రకారం ఉన్న రెండు మార్గాలను అంటే ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా ప్రత్యా మ్నాయంగా బీఎన్ఎస్ఎస్ కింద విచారణ జరపడం వంటి అంశాలను మేజిస్ట్రేట్ పరిగణ నలోకి తీసుకోనందున ఆ ఉత్తర్వులో ఎటువంటి వివరణా లేదని స్పష్టమవుతోంది.” అని న్యాయమూర్తి అన్నారు.

# తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి మానవతా దృక్పథంతో రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు (34) 2013 జూన్ 20న ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అదృశ్యమయ్యారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విజ్ఞప్తి మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ ఉద్యమంలో మండల రాజు చురుకుగా పాల్గొన్నారని, ఈ క్రమంలో ఆయన అరెస్టై చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధించబడ్డారని, ఆ తర్వాత కాలంలో అదృశ్యమయ్యారని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. మండల రాజు తన వృద్ధ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడని, ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ అమరవీరుల కోటా కింద మానవతా దృక్పథంతో ఆయన తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మి రెడ్డికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు హైకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

వీడియో ఫుటేజీలను సేకరించి కోర్టుకు సమర్పించినప్పటికీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ప్రత్యేక కోర్టు పరిధిలో ఉన్నందున మెజిస్ట్రేట్ రిమాండ్‌ను తిరస్కరించలేరని చెప్పారు. ఆ ఉత్తర్వులను రద్దు చేసి ఎమ్మెల్సీల రిమాండ్‌కు ఆదేశించాలన్నారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది.

# జూరాల వద్ద హైటెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు చుట్టూ 12 కిలోమీటర్ల పరిధిలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాసు హనుమంతునాయుడు తదితరులను పోలీసులు తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. పాలమూరు జిల్లాలో సాగునీటి కోసం రెండు రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. జూరాల ఆయకట్టులో పొలాలు ఎండిపోవడంతో శనివారం రైతులే స్వయంగా ఎడమ కాలువ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో అధికారులు అర్ధరాత్రి తిరిగి గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో జూరాల ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జూరాల ప్రాజెక్టు ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జూరాలకు బయలుదేరారు. నందిమల్ల వద్ద పోలీసులు ఆయనను అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని నిరసన తెలిపేందుకు రైతులతో కలిసి వెళ్లడం నేరమా అంటూ చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల్ని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడ కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది.

# ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దాలి: మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)

గ్రామసభలు నిర్వహించి యాక్షన్ ప్లాన్‌పై తీర్మానాలను ప్రవేశపెట్టాలని మంత్రి సీతక్క మార్గనిర్దేశం చేశారు. ఆయా గ్రామాల వారీగా అవసరాలు, నిధుల ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యం క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది పంచాయతీలకు వచ్చే అన్ని నిధులపై గ్రామసభల్లో చర్చించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద రూ. 6,700 కోట్లను ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో సగటున రూ. 50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పనులు అడిగిన వారందరికీ కల్పించాలని సూచించారు. **ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలి..** ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జలసిరి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి అధికారులకు జిల్లాల వారీగా మానిటరింగ్ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు జిల్లాల్లో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. ఈ సమావేశాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో పర్యటించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# కేసీఆర్ హయాంలో ఆంధ్ర ప్రాజెక్టులకు మేలు : జూపల్లి కృష్ణారావు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు. రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు.

## వార్డు కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



**బాలానగర్ సెప్టెంబర్ 22 ( పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా సోమవారం మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి బాలానగర్ డివిజన్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న పనితీరును పరిశీలించి, వారితో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రక్రియను సజావుగా కొనసాగించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలు, పత్రాలను సిద్ధంగా ఉంచుకుని బీఎల్ఓలకు సమర్పించాలని ఆవుల రవీందర్ రెడ్డి సూచించారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొంటూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలందరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రజలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**- సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ పిలుపు**



**బాలానగర్ సెప్టెంబర్ 22 ( పీపుల్స్ న్యూస్)** తెలంగాణ ఉద్యమ యోధుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 41వ వర్ధంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీనగర్‌లో సీపీఐ, బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాంతం సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. బాపూజీ చూపిన మార్గంలో పయనిస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం, బీసీల హక్కుల సాధన, ప్రజా సంక్షేమం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కే. మనోచారి, గంగన్న, రంగీలా తదితరులు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళులర్పించారు.

## 8 రోజులుగా బాలుడి ఆచూకీ కోసం గాలింపు

**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**



ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జీఎంఆర్ కాలనీ, ఖాజీపల్లికి చెందిన 10 ఏళ్ల బాలుడు అన్మోల్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. బాలుడి తల్లి రింకు దేవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. రింకు దేవి తన కుమారుడితో కలిసి జీఎంఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆమె పనికి వెళ్లిన సమయంలో బాలుడు ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. బాలుడు మానసికంగా అస్థిరంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలోనూ రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి కొంతసేపటి తర్వాత తిరిగి వచ్చినట్లు పేర్కొన్నారు.అయితే ఈసారి బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయి ఎనిమిది రోజులైనా తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.బాలుడి వివరాలు: అన్మోల్, వయస్సు 10 సంవత్సరాలు. చివరిసారిగా జీఎంఆర్ కాలనీ, ఖాజీపల్లిలో కనిపించాడు. ఆ సమయంలో తెల్లటి చొక్కా, షార్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.బాలుడి ఆచూకీ తెలిసిన వారు లేదా బాలుడిని గుర్తించిన వారు వెంటనే ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# హెచ్ఏఎల్‌లో ఘనంగా అన్నసమారాధన

**-- నాలుగు వేల మందికి భోజన ఏర్పాట్లు.. పాల్గొన్న సీఈఓ సత్యనారాయణ, జనరల్ మేనేజర్ మురళీకృష్ణ**



**బాలానగర్ సెప్టెంబర్ 22 ( పీపుల్స్ న్యూస్)**
వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హెచ్ఏఎల్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సీఈఓ సత్యనారాయణ, జనరల్ మేనేజర్ మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ సత్యనారాయణ, జనరల్ మేనేజర్ మురళీకృష్ణ తొలుత గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారి చేతుల మీదుగా అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు, కార్మికులు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొనగా, సుమారు నాలుగు వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. అన్నసమారాధన సందర్భంగా నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్మికులు, అధికారులు, అప్రెంటిస్‌లు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ డీజీఎం (హెచ్ఆర్) విఠల్, భద్రతా విభాగం డీజీఎం కుమారస్వామి, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, కన్వీనర్ వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు గణేష్, కర్కా నాగరాజు, చంద్రరావు నాయక్, ఉప ప్రధాన కార్యదర్శి రాంచందర్, బాబీ, జోగారావు, అశోక్, ప్రవీణ్, కుతాడి కృష్ణ, సురేష్, సుధీర్, కృష్ణబాబు, వడ్డే నాగార్జున, వెంకటేష్, మంజుల, భారతి, నీలవేణి, జాహ్నవి, భాగ్య, సునీత, లత, రమణ, కుమార్, కృష్ణారావు, పోలేపల్లి శ్రీకాంత్, ప్రేమ్, ప్రవీణ్, శివరామరాజు, సూర్యప్రకాశ్, ఆంజనేయులు తదితరులతో పాటు కంపెనీ కార్మికులు, అధికారులు, అప్రెంటిస్‌లు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయంను సందర్శించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధి













**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21(పీపుల్స్ న్యూస్)**
మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని సోమవారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధి ఇటలీ దేశానికి చెందిన రోసన్నా నిట్టీ సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు రామప్ప విశిష్టత, ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు రామప్పకు యునెస్కో గుర్తింపు తరువాత పెరిగిన సందర్శకులు, ఆలయానికి పాలంపేట గ్రామానికి పెరిగిన ఆదాయం, పర్యాటకులకు కావలసిన సదుపాయాలు, అందుతున్న సౌకర్యాలు, జరిగిన అభివృద్ధి, జరుగుతున్న అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు, పాలంపేట ప్రజల జీవన విధానం, ఆదాయ వనరులు గురించి గైడ్ విజయ్ నీ అడిగీ తెలుసు కున్నారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట కూడ అధికారి అసిఫ్, టూరిస్ట్ పోలీసులు శ్రీనివాస్ , శ్రీకాంత్, బద్రు, అరుణ్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

- ●నిమజ్జన ప్రాంతాల్లో భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- ●శాఖల సమన్వయంతో నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి.
- ●జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.



**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
ఈ నెల 23న నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.
సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్, ఆర్డీవో, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారుల ు, తహసీల్దార్లు, ఎం పి డి ఓ లు, పోలీసు అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి గుర్తించి న ప్రాంతాలను అధికారులు ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నీటి లోతు, ప్రవాహ పరిస్థితులను అంచనా వేసి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బారికేడ్లు, విద్యుద్దీపాలు, తాగునీరు, పారిశుధ్యం, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయడంతోపాటు గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో సామర్థ్యానికి మించి ప్రజలు గుమిగూడకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఊరేగింపులు నిర్ణీత మార్గాల్లో, నిర్ణీత సమయాల్లో కొనసాగేలా ఉత్సవ కమిటీలకు ముందస్తు సూచనలు ఇవ్వాలన్నారు.
నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.
విద్యుత్ తీగలు, స్తంభాల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు రెప్పపాటు విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యామ్నాయ విద్యుత్ దీపాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.జలాశయాలు, చెరువులు, వాగుల వద్ద నీటి పరిస్థితులను నీటిపారుదల, మత్స్య శాఖల అధికారులు పరిశీలించాలని తెలిపారు. నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను నిర్ధారించి అవసరమైన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు, వృద్ధులు నీటి ప్రదేశాల సమీపానికి వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
ప్రతి నిమజ్జన ప్రాంతంలో వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పూర్తి సంసిద్ధతతో ఉండాలన్నారు. అన్ని మండలాల్లో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ వారి సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు,తహసీల్దార్లు, ఎంపిడిఓ శ్రీబ తమ పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు.సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని, అత్యవసర సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని పురపాలక, పంచాయతీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.
లోటుపాట్లకు తావులేకుండా రెవెన్యూ, పోలీసు, పురపాలక, పంచాయతీ, మత్స్య, గనులు, కార్మిక, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, భూగర్భ జల, రహదారులు భవనాలు, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, ఆర్డీవో కృష్ణవేణి, ములుగు పురపాలక కమిషనర్, జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి, గనులు భూగర్భ శాస్త్ర శాఖ సహాయ సంచాలకుడు, సహాయ కార్మిక అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డీఎస్పీ డీసీఆర్బీ, జిల్లా అగ్నిమాపక అధికారి, భూగర్భ జల శాఖ ఉప సంచాలకుడు, రహదారులు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా నీటిపారుదల అధికారి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, పోలీస్ స్టేషన్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలి

- ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి
- విచారణలు పూర్తి చేసి నోటీసులన్నీ అందజేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి








**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నమోదు అధికారి లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులకు సంబంధించిన విచారణలను సకాలంలో పూర్తి చేయాలని, జారీ చేసిన నోటీసులన్నీ సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల తహసీల్దార్ సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చనిపోయినా చికిత్స పేరుతో రూ.5 లక్షలు వసూలు చేశారంటూ ఆరోపణలు

**మరో రూ.80 వేలు చెల్లిస్తేనే మృతదేహం అప్పగిస్తామన్నారని యూఎస్‌ఎఫ్ఐ ఆరోపణ**




**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
సూరారం మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన అనంతరం కూడా చికిత్స పేరుతో డబ్బులు వసూలు చేసి, మృతదేహాన్ని అప్పగించేందుకు మరో రూ.80 వేలు చెల్లించాలని కోరినట్లు వచ్చిన ఆరోపణలను యూఎస్ఎఫ్ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. కుత్బుల్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి లివర్ సంబంధిత సమస్యతో తన తండ్రిని ఆస్పత్రికి తీసుకెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక పత్రికలో ప్రచురితమైన కథనం ప్రకారం, సదరు వ్యక్తి మధ్యాహ్నమే మృతి చెందినప్పటికీ సాయంత్రం వరకు చికిత్స కొనసాగించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని తెలిపారు. చికిత్స పేరుతో సుమారు రూ.5 లక్షలు వసూలు చేసిన అనంతరం, మృతదేహాన్ని అప్పగించేందుకు మరో రూ.80 వేలు చెల్లించాలని కోరినట్లు బాధిత కుటుంబం ఆరోపిస్తోందన్నారు. ఈ ఆరోపణలు వాస్తవమైతే ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగుల కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్న ఫిర్యాదులపై ప్రభుత్వం కఠినంగా పర్యవేక్షణ చేపట్టాలని చంద్రకాంత్ కోరారు. సూరారం మల్లారెడ్డి ఆస్పత్రిలో జరిగినట్లు ఆరోపిస్తున్న ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

**'అరైవ్ అలైవ్'తో సురక్షిత ప్రయాణంపై సందేశం**











**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా షేక్‌పేట్‌లోని ఓసిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ కాజల్ సింగ్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సంభాషించారు. శాంతి, సౌభ్రాతృత్వంతో పాటు రహదారులపై కూడా పరస్పర గౌరవం, బాధ్యతాయుత ప్రవర్తన అవసరమని ఆమె పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా నివారించవచ్చని వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత, చట్టాలకు సంబంధించిన పలు సందేహాలను అడిగారు. విద్యార్థుల ప్రశ్నలకు డీసీపీ సమాధానమిస్తూ సంబంధిత చట్టాలు, వాటి ప్రాముఖ్యత, అమలు విధానాన్ని సులభంగా వివరించారు. రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు సుమారు 650 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతకు సంబంధించిన సందేశాలతో ప్లకార్డులను ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
విద్యార్థులు బాధ్యతాయుతమైన రోడ్డు వినియోగదారులుగా మారడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా రోడ్డు భద్రత ప్రాధాన్యతను తెలియజేయాలని డీసీపీ సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ డి. ధనలక్ష్మి, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ ఉషా కరుమతి, కేంబ్రిడ్జ్ ప్రిన్సిపాల్ శ్వేత, వైస్ ప్రిన్సిపాల్ పునీత, ఇన్‌స్పెక్టర్లు కె. సుమన్, ఎం. రాజేంద్రప్రసాద్, పి. రుక్మిణి, కె.ఎన్. ప్రసాద్ వర్మతో పాటు పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

# వరి సాగులో ఆధునిక పద్ధతులతోనే అధిక దిగుబడులు

**- జనగామ 'పొలం బడి'లో పెద్దపల్లి ఏడీఏ ఎం.శ్రీనాథ్-**




**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
వరి పంట సాగులో రైతులు శాస్త్రీయ, ఆధునిక యాజమాన్య పద్ధతులను పాటించినప్పుడే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఎం. శ్రీనాథ్ సూచించారు. సోమవారం జనగామ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం బడి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనాథ్, కేవీకే శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వరి సాగులో నీటి యాజమాన్యం, సమగ్ర ఎరువుల వినియోగంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుత సీజన్‌లో వరి పంటను ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్ల సమస్యలను తొలిదశలోనే గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సాగు ఖర్చు తగ్గించుకోవాలి..
పంటలో పురుగులు, తెగుళ్లను ఆరంభంలోనే గుర్తించడం ద్వారా పంట నష్టాన్ని నివారించడమే కాకుండా, సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని స్పష్టం చేశారు. పురుగుమందులను పరిమితికి మించి వాడకూడదని, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన మోతాదులోనే వినియోగించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ కార్పొరేటర్ తోకల శ్యామణి రమేష్, కేవీకే హెడ్ వెంకటరమేష్, శాస్త్రవేత్తలు వెంకన్న, పిల్లి కిరణ్, మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) కె. ప్రకాష్, ఏఈఓ యోజనతో పాటు స్థానిక అభ్యుదయ, యువ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# షాపూర్ నగర్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

**వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన బీఆర్‌ఎస్ నాయకులు పుప్పాల భాస్కర్.**







**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్ నగర్ కాలనీలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తాటి రవికుమార్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి సిఎంసి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ విఘ్నేశ్వరుని కృపతో ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని శ్రీ పుప్పాల భాస్కర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, కమిటీ సభ్యులు బస్వరాజు, నరహరి, లక్ష్మణ్, శేషు, నగేష్, కుమార్, శేఖర్ గౌడ్, సాయి, సుజి, కృష్ణ రోహన్ తదితరులు, అలాగే కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ ఈడీకి జన్మదిన శుభాకాంక్షలు



**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చందన్ కుమార్ సమంత జన్మదినం సందర్భంగా ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, ఎన్‌బీసీ మెంబర్ బాబర్ సలీం పాషా సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈడీని శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చందన్ కుమార్ సమంత నిండు నూరేళ్ల పాటు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ సువార్తను రావు, జనరల్ సెక్రటరీ వేముల కృష్ణయ్య, నాయకులు గోపాల్ రావు, ఏ. సత్యనారాయణ, గోషిక మల్లేష్, కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 21 :**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 94 అర్జీలను స్వీకరించారు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయకుండా పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మొత్తం 94 దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు 55, సర్వే అండ్ ల్యాండ్స్‌కు 7, వ్యవసాయ శాఖకు 4, పంచాయతీ, మున్సిపాలిటీ శాఖలకు 3 చొప్పున, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, జిల్లా పరిషత్, మైన్స్ అండ్ జియాలజీ శాఖలకు 2 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, సంక్షేమం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కార్మిక, గృహ నిర్మాణ, ఎక్సైజ్, పరిశ్రమలు, విద్య, విద్యుత్, ఎస్సీ అభివృద్ధి, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, డీసీఓ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) శాఖలకు ఒక్కో దరఖాస్తు అందింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్, జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు, ఆర్డీఓ శేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నోటీసు ఇచ్చినా... పనులు ఆగవా?

**ఐదు అంతస్తులు కడుతుంటే... కళ్లుమూసుకున్నారా?**


పీపుల్స్ న్యూస్
నోటీసులతో అధికారులు కవర్.
కవర్ చుట్టి యజమాని అక్రమ నిర్మాణం.
●ఎవరైనా వస్తే 'మేనేజ్ చేసుకోండి' అంటూ సలహాలా?
●అక్రమ నిర్మాణం ఆగదు.. అధికారులు అడ్డుకోరు. !
●అడ్డదారుల్లో టౌన్ ప్లాన్ అధికారులు.!
●ప్రభుత్వ ఆదాయానికి గండి..!
స్థానిక ప్రజలకు పెనుసవాలుగా మారే అవకాశం ఉంది.
విమర్శలు రావడంతోనే హుటాహుటిన నోటీసులు!
peoplesnews.online | 19 Sep, 2026 | Page: 11 | Clip ID: C-372732
For more details, visit peoplesnews.online



**జూబ్లీహిల్స్ , సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
నగరంలో నిత్యం ఏదో ఒక మూలన బిల్డింగ్ కూలిపోవడమో, ఒక పక్కకు ఒరగడమో వంటి ఘటనలు మీడియాలో వస్తున్నప్పటికీ అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. రహమత్ నగర్ లో పవిత్ర నర్సింగ్ హోమ్ బిల్డింగ్ విషయంలోనూ సరిగ్గా ఇదే జరుగుతుంది. యజమాని ఎలాంటి అనుమతి తీసుకోకుండా 5 అంతస్తులు నిర్మాణం చేస్తుంటే..అధికారులు నోటీసులతో సరిపెట్టుకున్నారు.నిర్మాణ దశలోనే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. భవనం పూర్తయ్యే వరకు ఎందుకు వేచి చూస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**నిర్మాణం పూర్తయ్యాక చర్యలెందుకు?**
అక్రమ నిర్మాణాన్ని మొదటి దశలోనే గుర్తించి పనులు నిలిపివేస్తే సమస్య అక్కడితోనే ముగిసే అవకాశం ఉంది. కానీ నిర్మాణం రెండు, మూడు, నాలుగు.. చివరకు ఐదు అంతస్తులకు చేరుకునే వరకు అధికారులు పట్టించుకోకపోతే.. భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు.భవన నిర్మాణ భద్రత, ఫైర్ సేఫ్టీ, అత్యవసర మార్గాలు, నిర్మాణ సామర్థ్యం, చుట్టుపక్కల భవనాలపై పడే ప్రభావం వంటి అంశాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఆసుపత్రి, నర్సింగ్ హోమ్ వంటి ప్రజలు ఎక్కువగా వచ్చే భవనాల్లో భద్రతా ప్రమాణాల విషయంలో మరింత అప్రమత్తత అవసరం ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఇటువైపు తొంగి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి వదిలేయడం కాకుండా.. నోటీసు తర్వాత పనులు కొనసాగుతున్నాయా? నిర్మాణాన్ని నిలిపివేశారా? అవసరమైతే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకున్నారా? అన్నది అధికారులు పర్యవేక్షణ ఉండాలి.

**S.I.R. వంకతో అధికారులు బిజీ..!**
ప్రభుత్వ కార్యాలయాలకు తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో లేకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ఎప్పుడు చూసినా ౫×= విధులు, కోర్టు పనులు, హెడ్ఆఫీస్ సమావేశాలు అంటూ అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండకుండా వ్యక్తిగత పనుల కోసం బయటకు వెళుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.ఒక అధికారి అందుబాటులో లేకపోతే మరో అధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించినా.. అక్కడ కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు.ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్న అధికారులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరించకూడదని ప్రజలు సూచిస్తున్నారు. కార్యాలయాల్లో అధికారుల అందుబాటు, ప్రజల సమస్యలపై స్పందన, క్షేత్రస్థాయి పర్యటనలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. మరి ఎస్ ఐ ఆర్ తో బిజీగా ఉండే అధికారులు అక్రమ నిర్మాణాలు దగ్గర ముడుపులు తీసుకునేందుకు సమయం ఎట్లా సరిపోతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. బాధ్యత కలిగిన అధికారులుగా పవిత్ర నర్సింగ్ హోమ్ యజమాని నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని వెంటనే సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మత్తు పదార్థాలపై పోలీసుల నిఘా

**డాగ్‌స్క్వాడ్‌తో కిరాణా, బేకరీ షాపుల్లో తనిఖీలు**



**ఎల్లారెడ్డిపేట/రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 21:**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్,గొల్లపల్లి బస్టాండ్ పరిధిలోని కిరాణా,బేకరీ షాపుల్లో పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.గంజాయి,ఇతర మత్తు పదార్థాల విక్రయాలు గుర్తిస్తే సంబంధిత షాపు యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.తనిఖీల్లో డాగ్‌స్క్వాడ్ బృందం,కానిస్టేబుల్ సదుర్ల సతీష్ పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం ..

**నల్గొండ 21**
ఈ రోజు సేవ సంకల్ప అభిమానాలో భాగంగా రక్త దాన శిబిరం నిర్వహించగా దోరెపల్లి గ్రామ బీజేపీ సీనియర్ నాయకులు మల్లేపల్లి శ్రీధర్ రెడ్డి రక్త దానం చేశారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలు నిస్వార్థంతో ముఖ్యమంత్రిగా ప్రధాన మంత్రిగా సేవలందిస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి ఎంతో రుణపడి ఉన్నాము అని అన్నారు. ఆయన పుట్టిన రోజు పురస్కరించుకొని నెల రోజులు కార్యక్రమాలు భాగంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పిండి పాపిరెడ్డి, బీజేపీ యువమోర్చ అధ్యక్షులు సతీష్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి వెంకన్న, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తీరాందాస్ కనకయ్య, కిసాన్ మోర్చా జిల్లా ఐటీసీ ఎల్ కో కన్వీనర్ మాదగోని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



# సర్వే నంబర్ 23లో పాఠశాల నిర్మాణంపై అధికారుల మౌనం ఎందుకు?

- ●రేడియంట్ హైస్కూల్ నిర్మాణంపై రికార్డులు పరిశీలించారా?
- ●భూమి హక్కులు తేల్చకుండా అనుమతులు ఎలా?
- ●విద్యార్థుల భద్రతపై విద్యాశాఖ బాధ్యత ఏమిటి?






**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21(పీపుల్స్ న్యూస్)**
కుత్బుల్లాపూర్ పరిధిలోని సర్వే నంబర్ 23లో రేడియంట్ హైస్కూల్ నిర్మాణానికి సంబంధించి అనేక ప్రశ్నలు తలెత్తుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూమి హక్కులు, నిర్మాణ అనుమతులు, పాఠశాల భవన భద్రత వంటి కీలక అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.సర్వే నంబర్ 23కు సంబంధించిన భూమి రికార్డులను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించారా? భూమి స్వరూపం ఏమిటి? భవన నిర్మాణానికి ఏ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు మంజూరయ్యాయి? అనుమతులు మంజూరు చేసే సమయంలో సంబంధిత శాఖలు భూమి హక్కులు, రికార్డులను ధృవీకరించాయా? అనే ప్రశ్నలకు అధికారిక సమాధానం రావాల్సి ఉంది.

**రెవెన్యూ శాఖ ఏం తేల్చింది?**
భూమిపై వివాదం లేదా హక్కులకు సంబంధించిన సందేహాలు ఉన్నప్పుడు వాటిని రికార్డుల ఆధారంగా స్పష్టం చేయాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉంటుంది. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, ప్రభుత్వ రికార్డులు పరిశీలించి, భూమి హక్కులపై స్పష్టమైన నివేదిక ఇవ్వాల్సిన అధికారులు ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారో వెల్లడించాల్సిన అవసరం ఉంది.భూమి ప్రభుత్వానికి చెందినది కాదని రికార్డుల ద్వారా తేలితే అదే విషయాన్ని అధికారికంగా స్పష్టం చేయాలి. ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదో కూడా ప్రజలకు తెలియజేయాలి. ఈ రెండు అంశాల్లోనూ స్పష్టత లేకపోవడమే ప్రస్తుత వివాదానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**విద్యాశాఖ తనిఖీలు ఎక్కడ?**
పాఠశాల నిర్వహణకు అనుమతులు ఇవ్వడం లేదా కొనసాగించడం మాత్రమే విద్యాశాఖ బాధ్యత కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు చదువుకునే భవనం భద్రంగా ఉందా? సంబంధిత భవన అనుమతులు ఉన్నాయా? అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? విద్యార్థుల రక్షణకు అవసరమైన మౌలిక ప్రమాణాలు అమలులో ఉన్నాయా? వంటి అంశాలపై సంబంధిత నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.అలాంటి తనిఖీలు జరిగితే వాటి నివేదికలు ఏమిటి? లోపాలు గుర్తించారా? గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే విషయాలను విద్యాశాఖ స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పీపుల్స్ న్యూస్
పాఠశాల భద్రతపై విద్యాశాఖ నిఘా ఎక్కడ?
●సర్వే నంబర్ 23లో రేడియంట్ హైస్కూల్ నిర్మాణంపై అనేక సందేహాలు.?
●అధికారుల మౌనం వెనుక మతలబేంటి?
●సర్వే నంబర్ 23లో పాఠశాల నిర్మాణంపై విద్యాశాఖ, రెవెన్యూ అధికారుల తీరుపై తీవ్ర ప్రశ్నలు
●భూమి రికార్డులు పరిశీలించారా? అనుమతులు ఎలా వచ్చాయి? పిల్లల భద్రతపై బాధ్యత ఎవరిది?
ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ స్కూల్..?
విద్యాశాఖకు కనిపించని అక్రమాలు?
పిల్లల భద్రతపై నిర్లక్ష్యమా?
కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)

**ముడుపుల ఆరోపణలపై విచారణకు డిమాండ్**
ఈ వ్యవహారంలో విద్యాశాఖ, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ముడుపులు అందాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు. ఆరోపణలు నిజమా కాదా అన్నది తేల్చాల్సింది సంబంధిత విచారణ సంస్థలే.అందువల్ల అనుమతుల మంజూరు ప్రక్రియ, భూమి రికార్డుల పరిశీలన, నిర్మాణ అనుమతులు, పాఠశాల భద్రతా ప్రమాణాలపై ఉన్నతస్థాయి అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రమాదం జరిగిన తర్వాత మేల్కొంటారా?**
పాఠశాల భవనాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే దాని ప్రభావం నేరుగా విద్యార్థుల భద్రతపై పడే అవకాశం ఉంటుంది. ఏదైనా ఘటన జరిగిన తర్వాత బాధ్యతలు నిర్ణయించడం కంటే ముందుగానే అనుమతులు, నిర్మాణ నాణ్యత, అగ్నిమాపక భద్రత, అత్యవసర మార్గాలు తదితర అంశాలను పరిశీలించడం అధికారుల బాధ్యత.సర్వే నంబర్ 23లోని రేడియంట్ హైస్కూల్ నిర్మాణంపై వస్తున్న ఆరోపణలు, అనుమానాలపై విద్యాశాఖ, రెవెన్యూ శాఖలు ఇకనైనా మౌనం వీడి పూర్తి వివరాలను వెల్లడిస్తాయా? లేక ఫిర్యాదులు, ప్రశ్నలు వచ్చినా పట్టించుకోకుండా వ్యవహరిస్తాయా? అన్నది వేచి చూడాల్సిందే.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

**- స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాధనలో ఆయన సేవలు చిరస్మరణీయం**





**కుత్బుల్లాపూర్: సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి గాజులరామారం డివిజన్ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సాయినాథ్ నేత అధ్యక్షతన బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి సారంగి అశోక్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన కీలక పాత్రను, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. తొలి దశ తెలంగాణ ఉద్యమం నుంచి మలి దశ ఉద్యమం వరకు ప్రజల ఆకాంక్షల కోసం ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజ సేవ, ప్రజా ఉద్యమాలు, తెలంగాణ సాధన కోసం బాపూజీ చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారులు కస్తూరి బాలరాజు, గూడే రాజశేఖర్, ఉపాధ్యక్షుడు ఎస్.వి.రావు, కోశాధికారి నాగభూషణ్, మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, జాయింట్ సెక్రటరీ జి.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పెంటయ్య, తుమ్మ నాగేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు 2దీఎఖ యాదగిరి, సామంతుల రాజు, ఈశ్వర్ ప్రసాద్, ఎలిగేటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు. పద్మశాలి కులబాంధవులు పెద్ద సంఖ్యలో హాజరై ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు అర్పించారు.

# పాఠశాలల్లో ఎంఈఓ నరేందర్ తనిఖీ

**విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని ఆదేశం**



**ముధోల్(తానూర్), సెప్టెంబరు 21**
మండలంలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, కల్పించిన మౌలిక వసతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మండల విద్యాధికారి (వీజూ) నరేందర్ తెలిపారు. సోమవారం ఆయన మండల పరిధిలోని సింగన్‌గావ్,దౌలాతాబాద్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజనం అమలు తీరును మరియు పాఠశాలల్లోని మౌలిక వసతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థుల చదువుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక కృషి చేయాలని,నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు .

# వెంకటాపూర్ లో 20 ఏళ్ల తర్వాత ఘనంగా పునఃప్రారంభమైన అంగడి సంత

**హర్షం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు**





**వెంకటాపూర్ ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**
వెంకటాపూర్ గ్రామంలో సుమారు 20 సంవత్సరాల తర్వాత అంగడి వారంతపు సంత ఘనంగా పునఃప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గతంలో గ్రామంలో సంత జరిగేదని, మధ్యలో ఆగిపోయిందని, ఇప్పుడు సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ స్వామి కృషితో, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తిరిగి సంత ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందని గ్రామస్తులు, రైతులు, మహిళలు అంటున్నారు. సోమవారం గ్రామ పంచాయతీ దగ్గర ప్రారంభమైన ఈ సంతకు ఉదయం నుండే ప్రజలు భారీగా తరలివచ్చారు. కూరగాయలు, పండ్లు, బట్టలు, చీరలు, ఇంటి అవసరాల వస్తువులు ఒకే చోట తక్కువ ధరకు లభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.20 ఏళ్ల క్రితం సంత జ్ఞాపకాలు మళ్లీ గుర్తుకు వచ్చాయని, ఇకపై ప్రతి సోమవారం ఈ సంతను కొనసాగించాలని గ్రామ ప్రజలు సర్పంచ్ ను కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుగుణ స్వామి మాట్లాడుతూ... గ్రామ ప్రజల కోరిక మేరకు, రైతులకు, చిన్న వ్యాపారులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 20 ఏళ్ల తర్వాత మళ్లీ సంతను ప్రారంభించాం. ప్రజలందరి సహకారంతో ప్రతి సోమవారం దీన్ని విజయవంతంగా నిర్వహిస్తాం" అని తెలిపారు.సంతను సందర్శించిన ప్రజలతో, వ్యాపారులతో సర్పంచ్ కలిసి మాట్లాడారు.

# ప్రజావాణికి ఒకే ఒక్క దరఖాస్తు!

**త్వరగా పరిష్కరిస్తాం: ఎంపీడీఓ శ్రీధర్**



**ముధోల్ (తానూర్), సెప్టెంబర్ 21** నిర్మల్ జిల్లా తానూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఈ వారం కేవలం ఒకే ఒక్క దరఖాస్తు వచ్చినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడుతూ.. తమ శాఖకు సంబంధించి ఈరోజు ఒక దరఖాస్తు అందినట్లు పేర్కొన్నారు. సదరు అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని,తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మామునూరు(వరంగల్) విమానా శ్రయానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి.

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేసిన**
**- కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవిగౌడ్**
**- కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్**





**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21( పీపుల్స్ న్యూస్)**
ఎన్నో ఏళ్ల కల అయిన మామూనూరు విమానాశ్ర యానికి గోల్కొండ కోట పైన జెండా ఎగురావేసిన బహుజనవిప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు ను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేయాలనీ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవిగౌడ్. కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్.రాష్ట్ర ప్రభుత్వానికి విజప్తి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సామాజిక సమానత్వం బహుజనులఆత్మ గౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటాన్ని గుర్తిస్తూ ఆయన పేరు పెట్టడం సమచిత న్యాయం అన్నారు.ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని రవి గౌడ్ శ్రీనివాస్ గౌడ్ కోరారు..

# భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు

**అన్నదానంలో పాల్గొన్న డీఎస్పీ, సీఐ**



**కొమరం భీం, సెప్టెంబర్ 21:** కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా, ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో త్రివర్ణ జనశక్తి మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదొద్దీన్, రూరల్ సీఐ కుమారస్వామి గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐలను ఎమ్మెల్సీ దండే విఠల్ శాలువాలతో సత్కరించారు.

# మద్యపాన నిషేధంపై అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 21**
పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు అడ్డూరి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా ఇన్చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ మద్యపాన నిషేధాన్ని కోరుతూ అక్టోబర్ 2న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మద్యపానంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం మద్యపాన నిషేధంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమానికి ఎల్కతుర్తి మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.అదేవిధంగా అక్టోబర్ 7న చలో అమరావతి కార్యక్రమానికి ఎమ్మారీమండల జాతీయ సదస్సును విజయవంతం చేసేందుకు ఎల్కతుర్తి మండలం నుంచి భారీగా హాజరు కావాలని సూచించారు.ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు రావాలని ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ కోరారు.సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ మాట్లాడుతూ సంఘం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టు ఫోరం నాయకులు బొంకూరి వంశీ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి చిలుముల వినోద్ మాదిగ, మండల నాయకులు అడ్డూరి నవీన్ మాదిగ, అల్లకొండ బాలు మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రమ్యూజియంను పునరుద్ధరించాలి : సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు

**కొమురం భీం, సెప్టెంబర్ 21**



హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలంగాణ రాష్ట్ర మ్యూజియాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు సందర్శించారు. మ్యూజియంలోని పురాతన విగ్రహాలు, కళాఖండాలు, బుద్ధుని అవశేషాలు, ఈజిప్షియన్ మమ్మీ తదితర చారిత్రక వస్తువులను పరిశీలించారు. మ్యూజియం తెలంగాణ ఘనమైన వారసత్వానికి ప్రతీక అని పేర్కొంటూ, కనీస నిర్వహణపై ప్రభుత్వం దృష్టిసారించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## మహిళా ఓటర్లదే పైచేయి




**స్పెషల్ డెస్క్:** తెలంగాణ ఓటర్ల జా బితాలో మహిళలదే పైచేయి. ఈ విషయం కొత్తగా బయటపడిందేమీ కాదు. 2023లోనే రాష్ట్రంలో మహిళా ఓటర్ల సంఖ్య తొలిసారిగా పురుష ఓటర్లను దాటింది. ఇప్పుడు 2026 ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలోనూ మహిళల ఆధిక్యం కొనసాగుతున్నట్లు అం దుబాటులో ఉన్న తాజా గణాంకాలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం ఉన్నది ముసాయిదా జాబితా మాత్రమే. తుది జాబితా నవంబర్ 9న వెలువడనుంది. **2023లోనే తొలిసారి..**2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. అందులో మొత్తం 3,26,18,205 మంది ఓటర్లున్నారు. వీరిలో 1,62,98,418 మంది పురుషులు కాగా 1,63,01, 705 మంది మహిళలు. మరో 2,676 మం ది ట్రాన్స్ జెండర్లు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 3,287 మంది ఎక్కువ. ప్రతి 1,000 మంది పురుష ఓటర్లకు మహిళా ఓటర్ల సంఖ్య 1,000.2గా నమోదైంది. అం తకుముందు జనవరి 2023లో ఈ నిష్పత్తి 992గా ఉండేది. అంటే ఏడాది వ్యవధిలోనే మహిళా ఓటర్ల ని ష్పత్తి గణనీయంగా మెరుగుపడింది. తెలంగాణలో తొ లిసారిగా మహిళా ఓటర్లు పురుషులను అధిగమించిన సందర్భం ఇదే. 2023 అక్టోబర్ నాటికి ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు మహిళల సంఖ్య 998కు చేరగా తుది జాబితాలో 1,000.2కు పెరిగింది. **సర్ ఏం చెప్పింది?** 2026 సర్‌కు ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. ఇంటింటి సర్వేలో 2,64,87, 213 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారు. మిగిలిన 73,39,235 మంది పేర్లను తాత్కాలికంగా ఏఎస్ డిడి కేటగిరీలో ఉంచారు. ఇం దులో మరణించినవారు, ఆచూకీ లేనివారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలిపోయినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనవారు ఉన్నారు. అయితే ఈ 73.39 లక్షల పేర్లను శాశ్వతంగా తొలగించినట్లు కాదు. వీరిలో అర్హులైన వారు తమ పేర్లను తిరిగి నమో దు చేయించుకునే అవకాశం ఉంది. సర్ ప్రక్రియలో మరో 92.87 లక్షల మంది ఓటర్ల వివరాల్లో ప రిశీల న అవసరమని గుర్తించారు. వారిలో 60,50,9 18 మంది విషయంలో అనామలీస్ ఉన్నట్లు గుర్తించా రు. మరో 32,36,659 మంది పేర్లను 2002 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయలేకపోయారు. వీరికి నోటీసులు ఇచ్చి వివరాలు, ఆధారాలను పరిశీలిస్తున్నారు. **మహిళల ఆధిక్యం కొనసాగుతుందా?** 2023లో మహిళలు పురుషులను దాటారు. 2026 సర్ తర్వాత కూడా మహిళా ఓటర్ల ఆధిక్యం కొనసాగుతుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్ర స్తుత ముసాయిదా జాబితాకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా పురుషులు-మహిళల సంఖ్యను విడిగా చూపించే తుది గణాంకాలు ఇంకా పూర్తికాలేదు. అది పూర్తయి తే మహిళలు ఎంతమంది ఎక్కువగా ఉన్నారో స్పష్టం గా తేలుతుంది. సర్ ప్రక్రియలో కొత్తగా అర్హత పొంది న యువతకు కూడా ఓటర్లుగా నమోదయ్యే అవకాశం ఉంది. 18 ఏళ్లు నిండిన వారు ఫారం-6 ద్వారా నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2023లోనే 18-19 ఏళ్ల వయసు గల 9,99,667 మంది యువ ఓటర్లు నమోదయ్యారు. ఈ వయసు వర్గంలో మహిళా ఓటర్ల నమో దు పెరగడం కూడా లింగ నిష్పత్తి మెరుగుపడటానికి ఒక కారణం.నవంబర్ 9న తుది చిత్రం సర్ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. క్లెయిమ్స్, అభ్యంతరాలకు అక్టోబర్ 7 వరకు అవకాశం ఉంది. నోటీసు లు, విచారణలు, అభ్యంతరాల పరిష్కారం నవంబర్ 5 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. అప్పుడే తెలంగాణలో మహిళా-పురుష ఓటర్ల అసలు సంఖ్య తేలుతుంది. అయితే ఇప్పటివరకు ఉన్న గణాంకాలు మా త్రం స్పష్టంగా ఒక విషయాన్ని చెబుతున్నాయి. 2023 లోనే తెలంగాణలో మహిళా ఓటర్లు పురుషులను దాటారు. తాజా సర్ తర్వాత ఆ ఆధిక్యం ఎంతవరకు కొనసాగిందన్నది నవంబర్ 9న తేలనుంది.

## డిజిటల్ చీకట్లలో చిన్నారులకు ఆశాదీపం



డిజిటల్ విప్లవంలో భాగమైన సోషల్ మీడియా మానవ సంబంధాలను, సమాచార మార్పిడిని వేగవంతం చేసినప్పటికీ, దాని వెనుక దాగి ఉన్న చేదు నిజం నేడు యావత్ సమాజాన్ని తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. ముఖ్యంగా నిరపరాధులైన చిన్నారులపై జరుగుతున్న ఆన్‌లైన్ లైంగిక వేధింపులు, వారి అశ్లీల దృశ్యాల ప్రసారం నైతిక సరిహద్దులన్నింటినీ తుడిచిపెట్టేస్తున్న దారుణమైన నేరం. ఈ నేపథ్యంలోనే చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన సమాచారాన్ని ఇకపై నేరుగా భారతీయ దర్యాప్తు సంస్థలకే అందజేస్తామని సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' తాజాగా అంగీకరించడం ఆహ్వానించదగిన పరిణామం.కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి, చట్టపరమైన బాధ్యతను గుర్తుచేసిన తర్వాతే ఈ నిర్ణయం వెలువడింది. ఇప్పటివరకు ఇలాంటి దురాగతాలకు సంబంధించిన సమాచారం అమెరికాకు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్' (ఎన్‌సిఎంఇసి) ద్వారా చుట్టూ తిరిగి భారతీయ ఏజెన్సీలకు చేరేది. ఆ సుదీర్ఘమైన ప్రక్రియలో ఎంతో కీలకమైన సమయం వృథా కావడంతోపాటు బాధితులకు తక్షణ న్యాయం అందించడం లేదా నేరస్థులను సకాలంలో పట్టుకోవడం కష్టంగా మారేది. ఆ మధ్యవర్తిత్వపు అడ్డంకులను తొలగించి, మెటా నేరుగా భారత దర్యాప్తు సంస్థలకే నివేదించడానికి ముందుకు రావడం అనేది సైబర్ భద్రతా వ్యవస్థలో ఒక రకమైన పురోగతి అని చెప్పవచ్చు.అయితే, ఈ అంగీకారం మాత్రమే డిజిటల్ ప్రపంచంలో మురిసిపోతున్న మన పిల్లలను సంపూర్ణంగా కాపాడేస్తుందని అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. దర్యాప్తు సంస్థలకు సమాచారం ఇస్తామని చెప్పడం మొదటి అడుగు మాత్రమేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు సైతం స్పష్టం చేయడం వెనుక ఉన్న తీవ్రతను మనం అర్థం చేసుకోవాలి. మన దేశంలో ఇంటర్నెట్ చౌకగా మారడం, ప్రతి ఇంటా స్మార్ట్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరగడంతో డిజిటల్ పరిజ్ఞానం లేని చిన్న పిల్లలు కూడా సులభంగానే ఈ డిజిటల్ ప్రపంచంలో చిక్కుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని వికృత మనస్తత్వం కలిగిన నేరగాళ్లు, గ్యాంగ్‌లు పిన్న వయస్కులను టార్గెట్ చేస్తున్నారు.డీప్‌ఫేక్ సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాధనాలు విస్తృతమయ్యాక లైంగిక వేధింపుల స్వరూపం మరింత ప్రమాదకరంగా మారింది. నిజమైన చిత్రాలను వికృతంగా మార్చడం నుంచి, నకిలీ ప్రొఫైళ్లతో పిల్లలను బురిడీ కొట్టించే వరకు సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను ఆయుధంగా మలుచుకుంటున్నారు.

# ఆశ్రమ పాఠశాలలో అర్ధరాత్రి కలకలం!

- గిరిజన బాలికల హాస్టల్‌లో అసలేం జరుగుతోంది?
- స్టడీ అవర్స్‌లో కర్రతో దాడి.. ముగ్గురు బాలికలకు అస్వస్థత!
- వార్డెన్ ఎక్కడ? పర్యవేక్షణ బాధ్యతలు ఎవరివి?
- అర్ధరాత్రి విద్యార్థుల ఫోన్‌తో విషయం వెలుగులోకి.. తల్లిదండ్రుల్లో తీవ్ర ఆగ్రహం








**ఏటూరునాగారం, ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)**గిరిజన బాలికలకు రక్షణగా ఉండాల్సిన ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో చోటుచేసుకున్న ఘటన కలకలం రేపింది. స్టడీ అవర్స్‌లో చదవడం లేదంటూ 9వ తరగతి లీడర్ విద్యార్థిని ముగ్గురు బాలికలను కర్రతో కొట్టినట్లు తల్లిదండ్రులు తెలిపారు. దీంతో 6వ తరగతికి చెందిన ఒకరు, 7వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురై అస్వస్థతకు లోనయ్యారు. అనంతరం వారిని ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

**వార్డెన్ ఎక్కడ?**
ఘటన జరిగిన సమయంలో హాస్టల్ వార్డెన్ లింగయ్య అందుబాటులో లేకపోవడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు ముగియడానికి ముందే వార్డెన్ హాస్టల్ నుంచి వెళ్లిపోయి విద్యార్థినుల బాధ్యతలను నైట్ వాచ్‌మెన్‌కు అప్పగించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థినుల భద్రతకు సంబంధించిన సమయంలో పర్యవేక్షణ బాధ్యతలు ఎలా నిర్వహించారనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

**అర్ధరాత్రి ఫోన్‌తో బట్టబయలు!**
ముగ్గురు బాలికలను కొట్టిన ఘటనపై హాస్టల్ నిర్వాహకుల నుంచి తమకు వెంటనే సమాచారం అందలేదని తల్లిదండ్రులు తెలిపారు. రాత్రి 1--2 గంటల సమయంలో తోటి విద్యార్థినులు వేరే వ్యక్తి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతోనే విషయం తెలిసిందని చెప్పారు. దీంతో ఉదయం తల్లిదండ్రులు హుటాహుటిన హాస్టల్‌కు చేరుకున్నారు.

**ప్రశ్నించడంతో మరో కలకలం**
తల్లిదండ్రులు ఘటనపై ప్రశ్నిస్తున్న సమయంలో భయాందోళనకు గురైన లీడర్ విద్యార్థిని తన మణికట్టును చాకుతో కోసుకున్నట్లు సమాచారం. దీంతో హాస్టల్ ప్రాంగణంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**వరుస ఘటనలు.. పర్యవేక్షణపై పిడుగులాంటి ప్రశ్నలు!**
ఇదే ఏటూరునాగారం మండల కేంద్రంలోని మరో గిరిజన బాలికల హాస్టల్‌లో ఈ నెల 7న తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల సమస్యలపై విద్యార్థినులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఆ ఘటనపై అధికారులు విచారణ చేపట్టి సిబ్బందిపై బదిలీ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఒక ఘటన మరువకముందే మరో హాస్టల్‌లో బాలికలపై దాడి ఘటన వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. బాలికల భద్రతకు పెద్దపీట వేయాల్సిన హాస్టళ్లలో వరుసగా సమస్యలు ఎందుకు బయటపడుతున్నాయి? పర్యవేక్షణ వ్యవస్థ ఎక్కడ విఫలమవుతోంది? విద్యార్థినుల రక్షణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అన్న ప్రశ్నలు తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాలికల భద్రతకు కఠిన చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# నాటి సంస్కరణోద్యమాల్లో స్త్రీ స్వరాలు

మన దేశంలో జరిగిన సంస్కరణోద్యమాలు లేవనెత్తిన ప్రశ్నల్లో ప్రధానమైనవి స్త్రీల పట్ల జరిగిన అన్యాయాల గురించే. ఐతే, ఆ ఉద్యమాల ప్రస్తావనలో ముందుగా గుర్తొచ్చేవి కొందరు పురుష సంస్కర్తల పేర్లే. ఆధునిక విద్య, సామాజిక హోదా కలిగిన పురుషులకు మాత్రమే వాటిని చేపట్టగల అవకాశం ముందుగా దొరకటమన్నది సహజమే. వారి కృషి విలువైనదీ, స్త్రీలకు ఎంతో ప్రయోజనకరమైనదీ కూడా. కానీ ఆ ఉద్యమాల చరిత్రలో స్త్రీలను బాధితులుగా, లబ్ధిదారులుగా మాత్రమే అంచనా వెయ్యటాన్ని తరచుగా చూస్తుంటాం.ఆ అంచనా సరైనదేనా? వలస పాలనలోని ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమాలకు స్త్రీలు ఎలా స్పందించారు? ఆ ఉద్యమాల దృక్పథాలను వారు పూర్తిగా అంగీకరించారా? కొత్త అవగాహనను ప్రతిపాదించారా? ఉద్యమాల నిర్వహణలో వారి పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలకు ప్రధాన స్రవంతి చరిత్రలో దొరికే జవాబులు స్వల్పం. వాటికి సమాధానాలు వెదికే ప్రయత్నమే-- మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ షేఖ్ మహబూబ్ బాషా చేసిన పరిశోధన.'స్క్రిప్టింగ్ ఎ న్యూ జెండర్ పొలిటిక్: తెలుగు విమెన్స్ జర్నల్స్ 1883--1960' (ఓరియంట్ బ్లాక్‌స్వాన్ ప్రచురణ, 2025) అనే ఈ పరిశోధనా గ్రంథంలో పై విషయాలను ఐదు అధ్యాయాల కింద విభజించి పరిశీలించారు. ముఖ్యంగా ఎనిమిది దశాబ్దాల కాలంలో వెలువడిన స్త్రీల పత్రికలను ఆధారం చేసుకుని ఈ పరిశోధన సాగింది.స్త్రీల కోసం ప్రారంభమైన తొలి పత్రిక 'సతీహిత బోధిని' (1883) కందుకూరి వీరేశలింగం నిర్వహణలో, రెండవ పత్రిక 'తెలుగు జనానా' (1893) రాయసం వెంకట శివుడు సంపాదకత్వంలో వెలువడినాయి. స్త్రీవిద్య, బాల్యవివాహాల రద్దు, గృహ నిర్వహణలో స్త్రీల నైపుణ్యాన్ని పెంచటం వంటి అంశాలను ఈ పత్రికలు చర్చించాయి, స్త్రీల రచనలను ప్రోత్సహించాయి. ఐతే, ఈ వాదనల్లో పురుష సంస్కర్తల దృక్పథానికి, తర్వాతి రోజుల్లో స్త్రీలు స్వయంగా తమ సమస్యలను మాట్లాడిన తీరుకు స్పష్టమైన భేదం ఉండటాన్ని ఈ పరిశోధన గ్రంథం ఎత్తి చూపింది.దేశంలో కొత్తగా ఏర్పడుతున్న పెట్టుబడిదారీ ఆధునికతకు ప్రతినిధులుగా విద్యావంతులైన పురుష సంస్కర్తలు స్త్రీలపై భూస్వామ్య వ్యవస్థ విధించిన కొన్ని ఆంక్షలను, దురాచారాలను వ్యతిరేకించటం ప్రగతిశీలమైన అంశమే అన్నది కాదనలేం. ఐతే, ఈ కొత్త వ్యవస్థ కూడా పితృస్వామికమైనదే, కుటుంబ నిర్మాణాన్ని కాపాడుకోవటమనే ప్రాధాన్యానికి లోబడినదే. కాబట్టి అది కుటుంబ ప్రయోజనాలకు భంగం కలగనంత వరకే స్త్రీల స్వేచ్ఛను అనుమతిస్తుంది. ఆ లక్షణం ఈ సంస్కరణల్లో ప్రతిచోటా కనబడుతూనే ఉన్నప్పటికీ, సంప్రదాయ వాదుల నుంచి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కోక తప్పలేదు. అందుకు పురుష సంస్కర్తలు ఒక ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించుకున్నారు. బాలికా వివాహాలు వేదకాలంలో లేవని; స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాలూ వేద విహితమేనని ప్రామాణికంగా ఆధారాలను చూపుతూ సంప్రదాయ పండితులను ఒప్పించాలని ప్రయత్నించారు. స్త్రీలు విద్యా వంతులైతే కుటుంబాలను మరింతగా చక్కదిద్దుకుంటారని హామీ ఇచ్చారు. తమ సంస్కరణల ద్వారా రూపొందిన స్త్రీలు, ఆధునిక భావాలున్న పురుషులకు అనుకూలవతులైన భార్యలుగా, కుటుంబాలను సుస్థిరం చేయటానికి పరిమితం అవుతారే తప్ప, వాటి భద్రతను భంగపరచబోరని ఈ సంస్కర్తలు నాటి సమాజానికి భరోసా ఇచ్చారు. వీరేశలింగం వ్యాసాలు, కాల్పనిక సాహిత్యమూ ఈ ధోరణిలో సాగినవే.స్త్రీలు నిర్వచించిన సంస్కరణల స్వరూపం ఇందుకు భిన్నమైనది. స్త్రీల చదువుకు పరమార్థం కుటుంబ నిర్వహణ, పాతివ్రత్యమూ కాదనీ, అది జ్ఞానాన్ని పొందటం కోసమూ, సామాజిక అభివృద్ధిలో భాగమవటం కోసమూననీ కనుపర్తి వరలక్ష్మమ్మ రాశారు. బాల్యవివాహాలను వేదాలు అంగీకరించాయా లేదా అన్నది విషయం కాదనీ, వాటివల్ల స్త్రీల శారీరక ఆరోగ్యం, బౌద్ధిక వికాసం కుంటుపడతాయి కాబట్టి అవి తగవనీ వాదించారు.
మైదవోలు పద్మావతీ దేవి, వేదుల మీనాక్షీ దేవి, చెరుకూరి నాగభూషణమ్మ, నందూరి కామేశ్వరి వంటి మహిళలు స్త్రీలపై ఇంటాబయటా సాగే పురుషాధిపత్యాన్ని నిర్ద్వంద్వంగా ఖండించారు. ఉద్ధరణ కోసం ఎదురుచూసే పీడితుల స్థితిని దాటి, చట్టబద్ధమైన హక్కులను డిమాండ్ చేశారు. ఇంటిపనికి ఆర్థిక వేతనం ఉండాలని, స్త్రీలపై విధించే నైతిక నియమాలను పురుషులకు కూడా వర్తింపచెయ్యాలని తీవ్ర స్వరంతో నిలదీసిన వాళ్ళు కూడా ఉన్నారు. ఇదంతా సజావుగా సాగిన ప్రయాణమేమీ కాదు, సంప్రదాయ వాదులైన పురుషుల నుంచి, స్త్రీలనుంచి కూడా దాడులను ఎదిరించి నిలిచారు.సంస్కరణోద్యమాల్లోని పరిమితులపై గురజాడ, చలం వంటి తరువాతి తరాల రచయితలు, సామాజిక ఉద్యమకారులు చేసిన విమర్శలు కూడా విలువైనవే. కానీ, స్త్రీల ఆరోగ్యం, పరిసరాల శుభ్రత, వారిపై ఇంటిపని భారం వంటి విషయాలపై సంస్కర్తల శ్రద్ధను, అంకితభావాన్ని తక్కువ చెయ్యటానికి వీల్లేదు. ఈ అంశాలను వీరేశలింగం, టి. రాజగోపాలరావు, వెంపటి శారదా దేవి వంటి వారు ఎంత శాస్త్రీయంగా సూక్ష్మ పరిశీలన చేశారో ఈ పుస్తకంలో చదువుతుంటే ఆశ్చర్యం వేస్తుంది.మహబూబ్ బాషా గారి పరిశోధన ఆ చరిత్రనంతటిని నమోదు చెయ్యటమేగాక, కొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది.
పద్నాలుగేళ్లలోపు బాలికల వివాహాలకు వ్యతిరేకంగా శారదాచట్టం వచ్చినప్పుడు వేలాది తల్లిదండ్రులు ముహూర్తాలు కూడా చూడకుండా ఏడాది దాటని పసిపాపలకు కూడా పెళ్లిళ్లు చేయటాన్ని ఈ గ్రంథంలో చదువుతాం. అంటే, హక్కుల కొరకు చట్టాలు ఎంతో అవసరమే అయినప్పటికీ,
ఆ కొత్త మార్పులను స్వీకరించే సంసిద్ధత సమాజానికి లేకపోతే, మరింత ప్రమా దకరమైన పరిణామాలు ఏర్పడగలవని ఈ పరిశోధన చేసిన హెచ్చరిక ఎప్పటికీ అవసరమైనదే.ఈ పరిశోధనలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఇక్కడ ప్రస్తావించిన ప్రతి విషయానికి సాధికారికమైన ఆధారాలను, అరుదైన ఫోటోలను చూపటం. ఉదాహ రణకు వితంతు పునర్వివాహాల సంఖ్యను చెప్పటమే కాకుండా ఆ వధూవరుల పేర్లు, కులాలు, శాఖలు, అవి జరిగిన ప్రాంతాల వివరాలను పది పేజీల పట్టి కలుగా ఇచ్చారు. వీటి ఆధారంగా ఆయా కులాల్లో ఈ సమస్య తీవ్రతను, మార్పుకు ఏ మేరకు సానుకూలత వ్యక్తమయిందన్న విషయాన్ని అంచనా వెయ్యవ చ్చు.ఇలా, గత చరిత్రను భిన్నమైన దృక్పథంతో చూపు తూనే, భవిష్యత్ ప్రతిపాదనలను చేస్తున్న ఈ పుస్తకాన్ని విస్తృతంగా చదివి, చర్చించాల్సిన అవసరం ఉన్నది.

# "లే ఆఫ్స్"




రోజురోజుకూ సాంకేతికత ఎంత విస్తరిస్తోందో, ఉద్యోగ భద్రత అంత ప్రశ్నార్థకంగా మారుతోంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ 'బ్లూవైన్'లో పనిచేస్తున్న ఎనభై మంది భారతీయ కస్టమర్ సర్వీస్ ఉద్యోగులను కేవలం ఐదు నిమి షాల గూగుల్ మీట్ ద్వారా తొలగించిన ఘటన ఐటీ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. 'ఆపరేషనల్ కారణాలు' చూపుతూ ఉద్యోగులందరినీ వర్క్ ఫ్రమ్ హోమ్ చేయించిన సంస్థ, రాత్రి షిఫ్ట్‌లో అత్యవస రంగా గూగుల్ మీట్ ఏర్పాటు చేసి లేఆఫ్ ప్రకటిం చింది. సమావేశం ముగిసిన వెంటనే ఉద్యోగుల ఈమెయిల్స్, అంతర్గత వ్యవస్థల యాక్సెస్‌ను నిలిపి వేసింది. తమ మాట చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వకపోవడం కార్పొరేట్ వ్యవస్థ అమానవీయతకు అద్దం పడుతోంది. లేఆఫ్ అంటే ముందు తెలుసుకోవాలి.
ఉద్యోగి తప్పు చేసినందుకు లేదా సరిగ్గా పనిచేయనందుకు తొలగించడం ఒక విష యం. కంపెనీ వ్యాపార అవసరాలు, ఖర్చుల తగ్గింపు, పునర్వ్యవస్థీకరణ, సాంకేతిక మార్పులు లేదా ఒక విభాగాన్ని కుదించడం వంటి కారణాలతో ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం మరో విషయం. రెండోది సాధా రణంగా లేఆఫ్ పరిధిలోకి వస్తుంది. అంటే ఉద్యోగి తనపని సరిగ్గానే చేస్తున్నా, కంపెనీ లాభనష్టాల లెక్కల్లో ఆ ఉద్యోగం 'అవసరం లేనిది'గా మారితే ఉపాధి పోవచ్చు. ఇక్కడే అసలు సమస్య ఉంది.

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
మంగళవారం, సెప్టెంబర్ 22, 2026



# నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం- సోమవారం నుంచి పవిత్రోత్సవాలు- దీని చరిత్ర మీకు తెలుసా?



విజయనగర రాజు తన భార్య పేరిట నిర్మించిన ఆలయం శ్రీ నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం! కులమతాలకు అతీతంగా జరిగే ఉత్సవాలు. సెప్టెంబర్ 21, సోమవారం నుంచి టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఉత్సవాల కోసం ప్రత్యేక కథనం.యుగధర్మంకృతయుగే నారసింహాయ, త్రేతా యుగే రామచంద్రాయ, ద్వాపరే శ్రీకృష్ణాయ, కలియుగే వేంకటనాథాయ! అని పురాణాలు శ్రీ మహావిష్ణువును ప్రస్తుతిస్తున్నాయి. కలియుగంలో శ్రీ మహావిష్ణువు వేంకటేశ్వర స్వామిగా అవతరించాడని పురాణం వచనం. ఒక్క తిరుమలలోనే కాదు వేంకటేశ్వర స్వామి ఎన్నో ప్రాంతాలలో తన భక్తుల కోరిక మేరకు అవతరించి వారి అభీష్టాలను నెరవేరుస్తున్నాడు. అలాంటి ప్రసిద్ధి చెందిన క్షేత్రమే శ్రీ నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం. సెప్టెంబర్ 21, సోమవారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్న తెలుసుకుందాం.నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం ఎక్కడుంది?కడప జిల్లా జమ్మలమడుగులోని పెన్నానది తీరంలో శ్రీ నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం వెలసి ఉంది. ఈ ఆలయంలో భక్తులు కులమతాలకు అతీతంగా స్వామిని సేవించడం విశేషం.ఆలయ చరిత్రవిజయనగర రాజు విజయ దేవరాయలు జమ్మలమడుగులో విష్ణు దేవాలయం నిర్మించదలచి ఈ ప్రాంతాన్ని తన భార్య నారాయణమ్మతో కలిసి సందర్శించాడు. కోవెల నిర్మించదలచిన ప్రదేశం తన భార్య నారాయణమ్మ పేరు కలిసి వచ్చే విధంగా ఆ అగ్రహారానికి నారాయణపురమని పేరు పెట్టాడు. కాలక్రమేణా అదే నారాపురంగా ప్రసిద్ధి చెందిందిస్థల పురాణంపూర్వం ఈ ప్రాంతానికి చెందిన నారాపురయ్య అనే ఒక భక్తునికి స్వప్నంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనమిచ్చి తనకు ఆలయాన్ని నిర్మించామని ఆదేశించాడంట! ఆ ఆదేశాన్ని అనుసరించి ఆ భక్తుడు అక్కడ మడుగులో లభించిన వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ఉత్తర దిశలోని ఇసుక తిన్నెల్లో ప్రతిష్ఠించాడు. అందువల్ల ఈ ఆలయం ఆ భక్తుని పేరిట నారాపురం వేంకటేశ్వరస్వామి క్షేత్రంగా ప్రసిద్ధి చెందిందని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. 70 ఏళ్లకు పైగా దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయం 2008 లో తిరుమ తిరుపతి దేవస్థానంలో విలీనమైంది. పూజోత్సవాలుశ్రీ నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజూ ఆగమ శాస్త్రానుసారంగా నిత్య పూజలు ఘనంగా జరుగుతాయి. ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవం నిర్వహిస్తారు. ఈ రథోత్సవం రోజున కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు స్వామి రథాన్ని లాగడం సామాజిక ఐక్యతకు నిదర్శనం. ఇక ప్రతి శనివారం, విజయదశమి, వైకుంఠ ఏకాదశి వంటి విశేష పండగ రోజులలో భక్తులు భారీ సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు

పవిత్రోత్సవాలుప్రతి సంవత్సరం భాద్రపద మాసంలో నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 21, సోమవారం నుంచి సెప్టెంబర్ 23, బుధవారం వరకు మూడు రోజుల పాటు ఈ పవిత్రోత్సవాలు జరగనున్నాయి. సందర్భంగా ఈ పవిత్రోత్సవాల విశిష్టతను తెలుసుకుందాం.

పవిత్రోత్సవాల విశిష్టతఆగమ శాస్త్రాన్ని అనుసరించి ఆలయంలో ఏడాది పొడవునా జరిగే పూజల్లో తెలియక జరిగే తప్పులు, లోపాలు ఏవైనా ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా మరియు ఆలయ పవిత్రతను కాపాడటానికి ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహణతిరుమల తిరుపతిదేవస్థానం వారి ఆధ్వర్యంలో, ఆలయ అర్చకుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ వేడుకలు ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా కొనసాగుతాయి.

ప్రత్యేక పూజలు

ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, స్వర్ణ పుష్పార్చన మరియు

# అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన శివలింగం- ప్రొద్దుటూరులో అరుదైన నవగ్రహా మండపం విశేషాలివే!





పరమేశ్వరుడు వెలసిన ఆలయాలలో ఎక్కువ భాగం అతి ప్రాచీన చరిత్ర కలిగినవే అయి ఉండడం విశేషం. వాస్తవానికి ఈశ్వరుడు వెలసిన ప్రతి క్షేత్రానికి ఓ కథ ఉంటుంది. కొన్ని శివాలయాలు విభిన్నమైన నిర్మాణ శైలితో ఆకట్టుకుంటాయి. అలాంటి ప్రత్యేకమైన ఓ శివాలయం ఈ కథనంలో తెలుసుకుందాం.

### అగస్త్యేశ్వరాలయం

వైఎస్?ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరాలయం చాలా ప్రాచీనమైనది. అతి ప్రాచీన ఈ శివలింగాన్ని అగస్త్య మహర్షి ప్రతిష్ఠించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఈ ఆలయాన్ని 8వ శతాబ్దంలో చోళుల కాలంలో, అప్పటి పాలకుడైన నంది చోళుడు నిర్మించినట్లుగా ఆలయంలో శాసనాల ద్వారా తెలుస్తోంది. అటు తర్వాత 15వ శతాబ్దంలో విజయనగర సేనాని నరస నాయకుడు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశాడు. ఈ ఆలయం నాలుగు ద్వారాలతో, అరుదైన శిల్పకళతో, ప్రత్యేక పూజా విధానాలతో ప్రసిద్ధి చెందింది.

### స్థల పురాణం

పరమేశ్వరుని ఆజ్ఞ ప్రకారం కాశీ నుంచి దక్షిణ భారతానికి బయల్దేరిన అగస్త్య మహర్షి, తన దక్షిణదేశ యాత్రలో భాగంగా అనేక ప్రాంతాల్లో శివలింగాలను ప్రతిష్ఠించాడు. అందుకో ఈ ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర లింగం కూడా ఒకటి. ఆకట్టుకునే ఆలయ నిర్మాణ శైలి

అగస్త్యేశ్వరాలయం 140 అడుగుల పొడవు, 120 అడుగుల వెడల్పు కలిగి నలుదిక్కులా నాలుగు ద్వారాలతో ఉంటుంది. ఇక్కడ ప్రధాన దైవం అగస్త్యేశ్వర స్వామి కాగా, దేవేరి రాజరాజేశ్వరీ దేవి. ఆలయ పునరుద్ధరణలో భాగంగా పశ్చిమాన ఉన్న రాజగోపురంపై అయిదు బంగారు కలశాలను ప్రతిష్ఠించారు. తూర్పున కూడా మరో రాజగోపురం ఉంటుంది. ఉత్తర దక్షిణ రాజగోపురాలపై కూడా బంగారు కలశాలను దర్శించవచ్చు.

ఆలయ విశేషాలుఇక్కడ అగస్త్యేశ్వర స్వామి ఆలయంతో పాటు భ్రమర లింగేశ్వర, సుందరేశ్వర, కోదండరామ ఆలయాలు కూడా వెలసి ఉన్నాయి. అలాగే ప్రత్యేక నవగ్రహ మండపం ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామికి, విడివిడిగా ఆలయాలున్నప్పటికీ రెండు ఆలయాలను కలిపే మండపం మాత్రం ఒకటే ఉండడం విశేషం. గర్భాలయంలో అగస్త్యేశ్వర స్వామితో పాటు వీరభద్ర, వినాయక, కార్తికేయ సన్నిధులు ఉన్నాయి. ఇక్కడ కార్తికేయుడు నెమలి వాహనంపై ఉండడం విశేషం.

అరుదైన నవగ్రహ మండపాలు

అగస్త్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నవగ్రహ మండపాలు సాధారణంగా ఇతర ఆలయాల్లో ఉండే మాదిరిగా కాకుండా ప్రత్యేకంగా ఉంటాయి. విలక్షమైన ఇలాంటి నవగ్రహ మూర్తులను ఒక్క కర్ణాటకలో రాష్ట్రంలోనే చూడవచ్చునని అంటారు.

వీరభద్రమూర్తిఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో వెలసి ఉన్న వీరభద్ర స్వామి సమభంగ నిల్చుని దర్శనమిస్తాడు. ఈ స్వామి కాళ్ల కింద మేక తల ఉండడం విశేషం.రససిద్ధి గంటలు

గర్భాలయంలో వెలసి ఉన్న అగస్త్యేశ్వర స్వామి లింగంపై రససిద్ధికి సంబంధించిన గంటలు ఉండటం . ఇది చాలా అరుదైన విశేషం.

### సత్కవులతో సంబంధం

తెలుగునాట వెలసి ఉన్న కొన్ని ఆలయాలతో కవులకు మంచి సంబంధం ఉంటుంది. కృష్ణాజిల్లా శ్రీకాకుళంలోని ఆంధ్రవిష్ణువు ఆలయంలో శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద రచించాడని అంటారు. అలాగే ఈ ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి ఓ కవికి కూడా సంబంధం ఉన్నట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ఆ క్షేత్ర మహిమకు ముగ్ధుడైన 20 వ శతాబ్దపు కవి సరస్వతి పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు తమ గేయకావ్యం 'శివతాండవాన్ని' ఇక్కడే రచించినట్లుగా ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఇందుకు జ్ఞాపకార్థంగా ఆ మహాకవికి ఒక స్మారక చిహ్నాన్ని కూడా ఏర్పాటు చేయడం ఆలయ విశిష్టతకు అద్దం పడుతుంది.ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయ సందర్శన వల్ల దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కారం అవుతాయని విశ్వాసం.ఎలా చేరుకోవాలి?ఆంధ్రప్రదేశ్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరు వెలసి ఉన్న అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచి మెరుగైన రవాణా సౌకర్యాలున్నాయి.మనం కూడా అగస్త్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి శివానుగ్రహాన్ని ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# యువతలో వృద్ధాప్య ఛాయలు - ఇలా సెట్? చేసుకోవాలని నిపుణుల సూచన!



నేటి యువత ఎక్కువగా అలసట, మానసిక ఒత్తిడి, చర్మ సమస్యలు, తక్కువ శక్తి స్థాయిలతో ఇబ్బంది పడుతున్నారు. ఇవి కేవలం సాధారణ ఆరోగ్య సమస్యలు మాత్రమే కావు. ఇవి అకాల వృద్ధాప్యానికి ముందస్తు సంకేతాలు కావచ్చు. ఒకప్పుడు 50 లేదా 60 ఏళ్లు దాటిన తర్వాత మాత్రమే కనిపించే వృద్ధాప్య లక్షణాలు, నేటి మారుతున్న జీవనశైలి కారణంగా యువతలోనే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇందుకు దీర్ఘకాలిక ఒత్తిడి, స్క్రీన్ సమయం పెరగడమే ప్రధాన కారణమంటున్నారు నిపుణులు. అందువల్ల, వృద్ధాప్య సంకేతాలను నెమ్మదింపజేయడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

ఒత్తిడి : నిరంతర మానసిక ఒత్తిడి శరీరంలో 'కార్టిసాల్' అనే హార్మోన్ స్థాయిలను విపరీతంగా పెంచుతుంది. ఈ హార్మోన్ హెచ్చుతగ్గుల వల్ల శరీరంలో అంతర్గతంగా అనేక నష్టాలు జరుగుతాయి. ఇది కణాల మరమ్మత్తు ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది. చర్మం స్థితిస్థాపకతను తగ్గించి ముడతలు పడేలా చేస్తుంది. తీవ్రమైన జుట్టు రాలడానికి కారణమవుతుంది. అంతేకాకుండా, ఒత్తిడి నిద్రలేమికి దారితీస్తుంది. దీనివల్ల శరీరం రాత్రి వేళల్లో చేసుకునే సెల్ఫ్ రిపేర్ ప్రక్రియ పూర్తిగా దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు.

స్క్రీన్స్ : మొబైల్? ఫోన్లు, లాప్?టాప్?లు, టాబ్లెట్?ల నుంచి వెలువడే బ్లూ లైట్ చర్మం లోపలి పొరల్లోకి చాలా సులభంగా చొచ్చుకుపోతుంది. ఇది చర్మాన్ని యవ్వనంగా ఉండే కొల్లాజెన్, ఎలాస్టిన్ అనే ప్రోటీన్లను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఫలితంగా, చర్మంపై ముడతలు, మచ్చలు లేదా పిగ్మెంటేషన్ వేగంగా పెరగుతాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, రాత్రివేళల్లో స్క్రీన్?లను ఎక్కువగా చూడటం వల్ల నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి క్షీణిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది నిద్రలేమికి దారితీసి, వృద్ధాప్య ప్రక్రియను మరింత వేగవంతం చేస్తుందంటున్నారు. అంతేకాదు, గంటల తరబడి స్క్రీన్లను చూడటం వల్ల కళ్లపై ఒత్తిడి పడి డార్క్ సర్కిల్, సన్నని గీతలు ఏర్పడతాయని పేర్కొంటున్నారు.పిల్లల స్నేహం 'టాక్సిక్' బంధంగా మారుతోందా? - పేరెంట్స్? ఈ పనులు చేయాలంట!రెండింటి కలయిక : మానసిక ఒత్తిడి, మితిమీరిన స్క్రీన్ సమయం, ఈ రెండూ తోడైనప్పుడు అకాల వృద్ధాప్య ముప్పు అనేక రెట్లు పెరుగుతుంది. నేటి యువత ఒక ప్రమాదకరమైన జీవనశైలి చక్రంలో చిక్కుకుపోయారు.

ఆఫీసులో ఉద్యోగ ఒత్తిడి మధ్య కంప్యూటర్? స్క్రీన్ల ముందు గంటల తరబడి పనిచేయడం, ఆ తర్వాత ఇంటికి వచ్చాక కూడా విశ్రాంతి లేకుండా మొబైల్స్?లో సోషల్ మీడియా, ఓటీటీ ప్లాట్?ఫారమ్?లపై గడపడం అలవాటుగా మారిపోయింది. దీనివల్ల శరీరానికి కనీస విశ్రాంతి కూడా దొరకడం లేదు. ఫలితంగా, శరీరం, చర్మం అనేవి సహజంగా మరమ్మత్తు చేసుకునే అవకాశాన్ని పూర్తిగా కోల్పోతాయి.నివారణ కోసం ఏమి చేయాలి? :డిజిటల్ డిటాక్స్ : ప్రతిరోజూ కొన్ని గంటల పాటు స్క్రీన్?లకు దూరంగా ఉండాలి. అలాగే, బ్లూ లైట్ ఫిల్టర్? గ్లాసెస్ ఉపయోగించాలి.ఒత్తిడి నిర్వహణ : ప్రతిరోజూ ధ్యానం, యోగా, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.మంచి నిద్ర అలవాట్లు : పడుకోవడానికి ఒక గంట ముందే స్క్రీన్?లకు దూరంగా ఉండాలి. అలాగే, 7 -8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి.పోషకాహారం : ఆకుకూరలు, బెర్రీలు, నట్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. అలాగే, ప్రతిరోజూ పుష్కలంగా నీరు తాగాలి.చర్మ సంరక్షణ : క్రమం తప్పకుండా సన్?స్క్రీన్ ఉపయోగించాలి.గమనిక : ఇక్కడ మీకు

# తిన్న తర్వాత నడక మంచిదట! - ఎందుకు? - నడవకపోతే ఏం జరుగుతుంది?



నడక వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలెన్నో. అయితే చాలా మంది భోజనం చేశాక కూర్చోవడం, పడుకోవడం చేస్తుంటారు. కానీ, తిన్న వెంటనే ఇలా చేయడం కంటే 10 నిమిషాల పాటు నడవడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే..

ప్రయోజనాలేమిటి? :రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ : భోజనం చేసిన వెంటనే శరీరంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయంటున్నారు నిపుణులు. అందుకే, తిన్న తర్వాత నడవడం వల్ల కండరాలు ఆ గ్లూకోజ్?ను శక్తిగా వాడుకుంటాయని అంటున్నారు. దీనివల్ల బ్లడ్ షుగర్ స్పైక్స్ తగ్గుతాయని పేర్కొంటున్నారు. ఇది ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి చాలా మేలు చేస్తుందని వివరిస్తున్నారు.

జీర్ణక్రియ మెరుగు : నడక వల్ల జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. జీర్ణాశయంలో ఆహారం సులభంగా కదలడానికి, త్వరగా అరగడానికి సహాయపడుతుందని అంటున్నారు.

కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు : చాలామందికి తిన్న తర్వాత కడుపు భారీగా అనిపించడం, గ్యాస్ లేదా ఉబ్బరం వంటి సమస్యలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కాసేపు నడవడంతో ఆ ఇబ్బందులు తగ్గుతాయని అంటున్నారు.

యాసిడ్ రిఫ్లక్స్ నివారణ : తిన్న వెంటనే పడుకోవడం వల్ల జీర్ణాశయంలోని ఆమ్లాలు పైకి వస్తాయంటున్నారు నిపుణులు. అయితే నడవడం వల్ల శరీరం నిటారుగా ఉండి, గుండెల్లో మంట లేదా ఎసిడిటీ వచ్చే అవకాశం తగ్గుతుందని చెబుతున్నారు.

బరువు నియంత్రణ : తిన్నాక నడవడం వల్ల శరీరంలో అదనపు క్యాలరీలు ఖర్చవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది బరువు పెరగకుండా చూస్తుందని అంటున్నారు.

తరచూ కండరాల నొప్పులా? - మెగ్నీషియం లోపం కావొచ్చంటున్న నిపుణులు!

నడవకపోతే ఏమవుతుంది? : భోజనం తర్వాత రక్తం అంతా జీర్ణక్రియ కోసం పొట్ట భాగంలోకి కేంద్రీకృతమవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు కదలకుండా కూర్చుంటే మెదడుకు, ఇతర భాగాలకు రక్త ప్రసరణ తగ్గి బద్ధకం, నిద్రమత్తు ఆవహిస్తాయని అంటున్నారు. అదే పది నిమిషాలు నడిస్తే రక్త ప్రసరణ మెరుగై చురుగ్గా ఉంటారని తెలియజేస్తున్నారు.

తిన్న ఆహారం ద్వారా వచ్చిన క్యాలరీలను శరీరం ఖర్చు చేయనప్పుడు, అది కొవ్వు రూపంలో మారి ముఖ్యంగా పొట్ట, నడుము భాగాల్లో పేరుకుపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ఒబెసిటీకి దారితీస్తోందని హెచ్చరిస్తున్నారు.

తిన్న వెంటనే రక్తంలో కొవ్వులు కూడా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. కదలికలు లేకపోవడం వల్ల ఈ కొవ్వులు కరగవు అని అంటున్నారు. ఇది దీర్ఘకాలంలో రక్తనాళాల్లో అడ్డంకులకు, బీపీ పెరగడానికి, గుండె జబ్బులకు కారణం కావచ్చని తెలియజేస్తున్నారు.షుగర్, బీపీ ఉన్నవారికి భోజనం తర్వాత నడక ఓ అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. తిన్న వెంటనే నడవడం వల్ల కండరాలు రక్తంలోని గ్లూకోజ్?ను నేరుగా వాడుకుంటాయి. దీనివల్ల షుగర్ లెవెల్స్ అకస్మాత్తుగా పెరగవు. అలాగే, రక్తప్రసరణను మెరుగుపరిచి బీపీని అదుపులో ఉంచడంతో పాటు గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. అలాగే, షుగర్ ఉన్న వారికి పాదాల రక్షణ చాలా ముఖ్యం. ఇంట్లో, బయట నడిచినా కచ్చితంగా మెత్తటి, సౌకర్యవంతమైన చెప్పులు లేదా షూస్ ధరించాలి. రాత్రి భోజనం తర్వాత నడవడమనేది వీరికి చాలా అవసరం. ఇది రాత్రిపూట వచ్చే ఎసిడిటీని తగ్గించి, ఉదయానికి ఫాస్టింగ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉండేలా చేస్తుంది. బీపీ ఎక్కువగా ఉన్నప్పుడు తిన్న వెంటనే నడవొద్దు. కాసేపు విశ్రాంతి తీసుకోవాలి.- శ్రీనివాస్?రావు, జీర్ణకోశ వైద్య నిపుణులుఎలా నడవాలి? :

ఉదయం అల్పాహారం తీసుకున్నాక కంగారుగా కాకుండా ప్రశాంతంగా 10 నిమిషాలు నడవాలని నిపుణులు చెబుతున్నారు

ఆఫీసులో మధ్యాహ్నం భోజనం చేసిన వెంటనే సీట్లలో కూర్చుంటారు. దీనివల్ల పొట్ట చుట్టూ కొవ్వు చేరుతుందంటున్నారు. కాబట్టి, కారిడార్?లో లేదా క్యాంపస్?లో 10 నిమిషాలు తిరగడం మంచిదట.

రాత్రి తిన్న వెంటనే పడుకోవడం వల్ల గ్యాస్, ఎసిడిటీ సమస్యలు పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. అందుకే, 10 నిమిషాలు నెమ్మదిగా నడవాలని అంటున్నారు. దీనివల్ల నిద్ర కూడా బాగా పడుతుందని చెబుతున్నారు.

తిన్న వెంటనే పరుగుపెట్టడం లేదా వేగంగా నడవడం వల్ల కడుపునొప్పి లేదా జీర్ణ సమస్యలు తలెత్తొచ్చట. జిమ్?కు వెళ్లడం లేదా బరువులు ఎత్తడం వంటివి చేయకూడదని పేర్కొంటున్నారు.ఇది వ్యాయామం కోసం చేసే నడక కాదు. కేవలం తిన్నది అరగడానికి చేసేది కాబట్టి చాలా నెమ్మదిగా, తేలికగా నడవాలని నిపుణులు చెబుతున్నారు. వేగంగా నడిస్తే రక్తం జీర్ణవ్యవస్థకు వెళ్లకుండా కండరాలకు మళ్లుతుందని.. దీనివల్ల గుండెపై ఒత్తిడి పడటమే కాకుండా అజీర్తి చేస్తుందని వివరిస్తున్నారు.గమనిక : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎ. శ్రీదేవి, వినికిడి లోపం ఉన్నవారి కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

● అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్




హైదరాబాద్‌లోని నాంపల్లి సెషన్స్ డివిజన్ పరిధిలో ఉన్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో, మలక్‌పేటలోని వినికిడి లోపం ఉన్నవారి ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో ఒక న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (నాంపల్లి సెషన్స్ డివిజన్) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా, భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు మరియు విధులు, సమానత్వపు హక్కు, విద్యా హక్కు, బాలల హక్కులు, మహిళలు మరియు దివ్యాంగులకు కల్పించిన చట్టపరమైన రక్షణలు, అలాగే ఉచిత న్యాయ సహాయం లభ్యత వంటి వివిధ అంశాలపై శ్రీమతి ఎ. శ్రీదేవి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, తాము ఎదుర్కొనే ఏవైనా చట్టపరమైన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని మరియు అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలని ఆమె వివరించారు. న్యాయ సేవలు అందరికీ అందుబాటులోఉండేలా చూడటమే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ లక్ష్యమని, ముఖ్యంగా అర్హులైన వ్యక్తులకు ఉచిత న్యాయ సలహాలు మరియు సహాయాన్ని అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. చట్టంపై అవగాహన పెంచుకోవాలని, తమ హక్కులను కాపాడుకుంటూనే ఇతరుల హక్కులను గౌరవించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులలో న్యాయపరమైన అవగాహనను పెంపొందించడం మరియు వారి హక్కులు, బాధ్యతల పట్ల చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు




**విజయనగరం, సెప్టెంబర్ 21 :** తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అత్యవసర సేవలను అందించాలన్నారు. రైతులు, రైతన్నలు, పశువుల కాపర్లు పొలాలకు వెళ్లిన సమయాలలో చెట్ల కింద ఉండకూడదన్నారు. ఉరుములతో పాటు పిడుగులు కూడా పడే అవకాశం ఉన్నందున ప్రజలు ఆరు బయట ప్రదేశాలలో కంటే సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు అత్యవసరమైతేనే ప్రయాణాలు కొనసాగించాలని, వర్షాలతో పాటు ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉన్నందున వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద ఉండకూడదన్నారు. అలాగే నదీ పరివాహక ప్రాంతాలలో సురక్షిత ప్రాంతాలలో ఉండాలని, సముద్రానికి వేటకు వెళ్లే మత్స్యకారులు వేటకు వెళ్లకూడదన్నారు. వర్షాలు కురిసిన సమయంలో వరదలు ప్రవహించే అవకాశం ఉన్నందున చిన్నారులను చెరువుల వద్దకు వాగులు వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. చిరు వ్యాపారుల సైతం వర్షాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని, చెట్ల కింద, హోర్డింగులు కింద ఉండటం కూడా సురక్షిత ప్రాంతాలలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వం తరపున ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో 08922-236947 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయటమైనదని, అత్యవసర పరిస్థితుల్లో మండల అధికారులతో పాటు టోల్ ఫ్రీ నెంబర్ను సంప్రదించాలన్నారు.

జారీ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీ ణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికా రత సంబంధాల శాఖ మంత్రి వర్యులు కార్యాలయం

## సచివాలయ సిబ్బంది కొరత తీర్చాలి. సిపిఐ డిమాండ్



**కామవరపుకోట, సెప్టెంబర్ 21:** మండల పరిధిలోని సచివాలయాలలో సిబ్బంది కొరత తీర్చాలని సిపిఐ నాయకులు టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. సచివాలయ పరిధిలో గల ప్రజల వారి అవసరాల కోసం సచివాలయానికి వచ్చి సిబ్బంది ఎవరూ లేక సచివాలయం ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తుంటే సచివాలయానికి వచ్చిన పలువురు నిరాశతో వెనుతిరిగి వెళ్ళిపోతున్నారని సిపిఐ కామవరపుకోట మండల కన్వీనర్ టీవీఎస్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అమీర్‌కు టీవీఎస్ రాజు వినతిపత్రం అందించారు పెన్షన్ల కోసం దరఖాస్తులు ఆన్లైన్ చేయటంలో సిబ్బంది కార్యాలయంలో లేరని మీడియాలో వార్తలు ప్రచురించిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని టీవీఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు మహిళ పోలీసు పోస్టు నందు మనోరమ అను ఆమె పనిచేసేవారని కానీ వారిని డి. ఎల్.డి.ఓ కార్యాలయం జంగారెడ్డిగూడెంకు డిప్యూషన్ పై పంపడం సరైన చర్య కాదని ఆయన అన్నారు వేతనం ఒకచోట తీసుకొని మరోచోట విధులు నిర్వహించడం సరికాదని వేతనం పొందిన చోటే విధులు నిర్వహించాలని టీవీఎస్ రాజు అధికారులకు హితవు పలికారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకొని ప్రజా అవసరాలకు ఉపయోగపడాలని టీవీఎస్ రాజు అధికారులు కోరారు

## వినాయక చవితి సందర్భంగా విందు భోజనం



**కామవరపుకోట, సెప్టెంబర్ 21:** వినాయక చవితి అంటే సాధారణంగా ప్రతి చోట అన్నదాన కార్యక్రమాలు చేయడం షరా మామూలే. అయితే కామవరపుకోట శివారు కొత్తూరు గ్రామంలోని గంగానమ్మ ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించే వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా భారీ అఖండ అన్న సమారాధన నిర్వహిస్తారు. అయితే అన్నిచోట్ల వలె బఫే భోజనం కాకుండా, అన్నదానాన్ని విందు భోజనంగా కుర్చీలు వేసి కూర్చుని భోంచేసే విధంగా ఏర్పాటు చేస్తారు. గ్రామంలోని గంగానమ్మ ఆలయ కమిటీ 11వ వార్షికోత్సవం సందర్భంగా 29 రకాలతో విందు భోజనం వలె అరిటాకులో భోజనాలు ఏర్పాటు చేయటాన్ని భోజన ప్రియులు ఎంతగానో ఆస్వాదిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 4500 మందికి పైగా ఇటువంటి భోజనాలు ఏర్పాటు చేయడం పట్ల కమిటీ వారు ఔరా అనిపించేలా చేసిన ఏర్పాట్లను చూసి కమిటీ వారిని పొగడ్తలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా కమిటీ వారి సభ్యులు మాట్లాడుతూ అన్ని దానములలో కెల్లా అన్నదానం మిన్న మనిషికి ఆత్మ తృప్తిని ఇచ్చేది ఒక అన్నదానం అనే సూక్తులను ఆదర్శంగా తీసుకుని వినాయకుని పేరు మీదగా ఈ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ (ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం) శ్రీ పాలడ అశోక్ మరియు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి (ఆడిట్ విభాగం) శ్రీ కలకుంట్ల కిరణ్ కుమార్ ఏసీబీ కి చిక్కారు.

● అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్



ఫిర్యాదుదారు తల్లికి సంబంధించిన నెలవారీ పెన్షన్ మరియు ఇంక్రిమెంట్ ప్రక్రియకు అవసరమైన నమోదులు చేయడానికి రూ. 15,000 లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా, నిజామాబాద్ పట్టణంలోని రాజా రాజేంద్ర చౌరస్తా సమీపంలో ఉన్న పద్మశాలి సంఘం (సీతారామనగర్ కాలనీ) వద్ద నిజామాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులు నిందితులను (ఆరో-1 శ్రీ పాలడ అశోక్ మరియు ఆరో-2 శ్రీ కలకుంట్ల కిరణ్ కుమార్) రెడ్-హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విధంగా, రూ. 15,000 లంచం స్వీకరించి, తన ప్రభుత్వ విధులను నిజాయితీ లేకుండా నిర్వహించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి. ప్రస్తుతం నిందితులను అరెస్టు చేసి, నాంపల్లిలోని కేసుల ప్రత్యేక న్యాయస్థానం అదనపు ప్రత్యేక న్యాయమూర్తి, హైదరాబాద్) ముందు హాజరుపరిచే ప్రక్రియ కొనసాగుతోంది. ఫోన్ నంబర్ 1064 (టోల్-ఫ్రీ నంబర్)కు కాల్ చేయండి. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే, చట్టపరమైన చర్యల కోసం ప్రజలు టోల్-ఫ్రీ నంబర్ 1064 ద్వారా ఏసీబీని సంప్రదించాలని కోరడమైనది. అలాగే ఏసీబీ తెలంగాణను 9440640100 నంబర్ ద్వారా లేదా ఫేస్‌బుక్ మరియు ఎక్స్ ద్వారా కూడా సంప్రదించవచ్చు. ఏసీబీ తెలంగాణను సంప్రదించడానికి వీలుగా ప్రముఖ ప్రదేశాలలో క్యూఆర్ కోడ్ ప్రదర్శించబడింది. పీఆర్ఓ, అవినీతి నిరోధక శాఖ హైదరాబాద్.

## గురజాడ సాహితీ సంపదను భావితరాలకు అందించాలి

● ఎంఎస్‌ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు

● పభుత్వ ఉత్సవంగా ఘనంగా మహాకవి 164వ జయంతి



**విజయనగరం, సెప్టెంబరు 21:** నవయుగ వైతాళికుడు గురజాడ వేంకట అప్పారావు సాహిత్యం శాశ్వతంగా నిలిచి ఉంటుందని, ఈ సంపదను భావితరాలకు అందించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మొట్టమొదటిసారిగా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రభుత్వ ఉత్సవంగా మహాకవి 164వ జయంతోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను, గురజాడ జయంతిని రాష్ట్రప్రభుత్వ ఉత్సవంగా ప్రకటింపజేయడంలో విశేషంగా కృషిచేసినందుకు ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పి ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, మన సంస్కృతిని, సంప్రదాయాలు, విలువైన సాహిత్యాన్ని సంరక్షించుకోవడంతపాటు, భావితరాలకు అందించాలని కోరారు. సుమారు 120 ఏళ్ల క్రితం ఉమ్మడి విశాఖజిల్లా నుంచి మలేషియాకు వలస వెళ్లిన తెలుగువారి ఉదంతాన్ని వివరించారు. వారంతా తెలుగు అసోసియేషన్‌గా ఏర్పాటై ఇప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలు, అలవాట్లను వారి పిల్లలకు అందజేస్తుండటం గొప్ప విషయంగా పేర్కొన్నారు. వారి ఇళ్లలో తెలుగు మాట్లాడుతుండం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా జెన్ జెడ్ కూడా ఇప్పటికీ అక్కడ తెలుగు సంప్రదాయాలను పాటిస్తున్నారని ప్రశంసించారు. మహాకవి గురజాడ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రికి పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ మాట్లాడుతూ, దేశమంటే మట్టికాదోయ్...దేశమంటే మనుజులోయ్ అన్న గురజాడ కవితను ప్రస్తావిస్తూ, సుమారు వందేళ్ల క్రితం గురజాడ రాసిన ఈ పలుకులు విశ్వవ్యాప్తంగా దేశభక్తికి ప్రేరణగా నిలుస్తాయని కొనియాడారు. ఆయన కన్యాశుల్కం గొప్ప సామాజిక స్పృహకు నిదర్శనంగా పేర్కొన్నారు. వాడుక భాషలో చేసిన గురజాడ రచనలు, గొప్ప మానవతా విలువలకు ప్రతీకగా ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయాయని అన్నారు. గురజాడ మానవత, సామాజిక దృక్పథం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ, మహాకవి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటింపజేస్తూ, ప్రభుత్వం నుంచి జీఓ193 విడుదల చేయించినందుకు, మంత్రి కొండపల్లిని ప్రత్యేకంగా అభినందించారు. గురజాడ సాహిత్యాన్ని, రామాయణ, మహాభారత కథలను, మన పౌరాణికాలను వాట్సాప్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా, యువతకు చేరువ చేసేందుకు కృషి చేయాలని సూచించారు. తద్వారా యువత మంచి వ్యక్తులుగా ఎదిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. గురజాడ కుటుంబ సభ్యురాలు ఇందిర, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు డాక్టర్ వెంకటేశ్వర్రావు, డాక్టర్ ఏ. గోపాలరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, గురజాడ గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ సిహెచ్ సత్తిబాబు, డిఈఓ మాణిక్యం నాయుడు, సిపిఓ బాలాజీ, డిప్యుటీ కలెక్టర్ మురళి, ఆర్‌డిఓ సుధాసాగర్, గృహనిర్మాణశాఖ పిడి మురళి, ఇతర అధికారులు, గురజాడ కుటుంబ సభ్యులు, సాంస్కృతిక సమాఖ్యల ప్రతినిధులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు. గురజాడ జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. గురజాడ కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా సన్మానించారు. మహారాజా సంగీత కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జారీ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి, విజయనగరం.

## వినాయకుడి వేలంలో విజేతలుగా నిలిచిన అక్కాచెల్లెల్లు

● రు. 10 నోట్లు, ఫ్రూట్స్ సొంతం



**రేపల్లె , సెప్టెంబర్ 21:** వినాయక విగ్రహం వద్ద ఉంచిన నైవైద్యం ఫ్రూట్స్‌తో పాటు రు. 10 నోట్లను వేలంలో అక్కాచెల్లెల్లు సొంతం చేసుకున్నారు. రేపల్లె మున్సిపాల్టీలోని 5వ వార్డు మిరియాల వారి వీధిలో బాలా గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట సోమవారం నిర్వహించారు. లడ్డూ వేలం తర్వాత వినాయకుడికి ప్రసాదంగా ఉంచిన ఫ్రూట్స్, వినాయకుడి మెడలో వేసిన రు. 10 నోట్ల దండను కూడా వేలం నిర్వహించారు. రేపల్లెకు చెందిన మండలి ఏకాంబరేశ్వరరావు, అంజలి దంపతుల కుమార్తెలు వేలంలో విజేతలుగా నిలిచారు. చెల్లి మండలి నాగ వెంకట అక్షర నాయుడు ( 6 సంవత్సరాలు ) ఫ్రూట్స్ రు. 3200కు సొంతం చేసుకోగా.. వినాయకుడికి దండగా వేసినరు. 10 నోట్లు వెయ్యి రు. 10,200 కు అక్క జయ లక్ష్మి మహతి నాయుడు ( 11 సంవత్సరాలు ) సొంతం చేసుకున్నారు. మేనమామ ఉమ్మారెడ్డి బాబితో కలిసి వేలంలో పాల్గొన్న చిన్నారులు వినాయకుడి ఫ్రూట్స్, రు. 10 నోట్లను వేలంలో పెద్దవాళ్లతో పోటీపడి సొంతం చేసుకుని ఆకర్షణగా నిలిచారు.

## పవన్ కళ్యాణ్ పేరుతో టిక్కెట్టుకు లక్కీడ్రా లో వినాయకుని లడ్డు



**కామవరపుకోట, సెప్టెంబర్ 21 :** కామవరపుకోట మండలం కేంద్రంలో నల్లమోతుల కిట్టు అనే ఆటో డ్రైవర్ పవన్ కళ్యాణ్ వీరాభిమానిగా పేరు పొందారు. వినాయక చవితి ఉత్సవాలలో లక్కీ డ్రాలో పవన్ కళ్యాణ్ పేరుతో టిక్కెట్లు కొనుగోలు చేశాడు. ఆదివారం నిర్వహించిన లక్కీ డ్రాలో పవన్ కళ్యాణ్ పేరుతో రాయించిన నెంబర్ టికెట్ కు లడ్డు రావడం పట్ల కిట్టు ఆనందానికి అవధులు లేవు. ఇప్పటికే కిట్టు తన పిల్లలకు పవన్ కళ్యాణ్ పిల్లలకు పెట్టిన అకిరా నందన్, జీవనాధ్య అనే పేర్లు కిట్టు కూడా తన పిల్లలకు అదే నామకరణం చేసి పవన్ కళ్యాణ్ పట్ల తనకు ఉన్న ప్రేమాభిమానాలను చాటి చెబుతాడు. తన అభిమాన దేవుడుగా కొలిచే పవన్ కళ్యాణ్ పేరుతో కొనుగోలు చేసిన టిక్కెట్టుకు తనకు లాటరీ దక్కటం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

## శ్రీ గురజాడ అప్పారావు ఆశయాలు నేటి, భవిషత్తు తరాలకు స్ఫూర్తిదాయకం.



● ఘనంగా జిల్లా కలెక్టరేటులో 164వ శ్రీ గురజాడ జయంతి వేడుకలు, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు.

● జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...

**ఏలూరు, సెప్టెంబరు 21:** జిల్లా కలెక్టరేటు గోదావరీ సమావేశ మందిరంలో సోమవారం 164వ శ్రీగురజాడ అప్పారావు జయంతి వేడుకలు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఘననివాళులు అర్పించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ,అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుండి శ్రీ గురజాడ అప్పారావు జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా జరుపుటకు ఆదేశాలు ఇవ్వడం శుభపరిణామని అన్నారు. నవయుగ వైతాళికుడు, ఆధునిక తెలుగు సాహిత్య దిక్సూచి, సంఘ సంస్కర్త, అభ్యుదయ కవి శ్రీగురజాడ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చాటిచెప్పిన ఆయన ఆలోచనలు, ఆదర్శాలు సమాజానికి నిరంతరం మార్గదర్శకాలని కొనియాడారు. తెలుగు సాహిత్యం, సామాజిక చైతన్యానికి ఆయన చేసిన సేవలు నేటి, భవిషత్తు తరాలకు సూర్తిదాయకం అన్నారు. గురజాడ రచనలను, ఆయన మానవతా విలువలను ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సుకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. శ్రీగురజాడ కలలుగన్న సమసమాజ స్థాపన కోసం, ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఈ వేడుకలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవిన్యూ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఇడియం. ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు యల్. దేవకీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, సెట్‌వెల్ సిఇవో కె.యస్. ప్రభాకరరావు, జిల్లా టూరిజం మేనేజరు యస్.పట్టాభిరామన్న, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సమాచార శాఖ, ఏలూరు నుండి జారీచే యడమైనది.

## గతంకంటే ఘనంగా దసరా మహోత్సవాలు




● సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ఏర్పాట్లు

● ఉచిత దర్శనాలతో పాటు ప్రసాదాల పంపిణీ

● ఏఐ సాంకేతికత అనుసంధానంతో భక్తుల భద్రతకు భరోసా

● ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతర పర్యవేక్షణ

● 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ)

● సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు

● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్

**విజయవాడ, సెప్టెంబర్ 21, 2026:** అక్టోబర్ 10 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా మహోత్సవాలను గతంలో కంటే ఘనంగా, భక్తులకు మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు తెలిపారు. ఏఐ సాంకేతికతను అనుసంధానం చేసి భక్తుల భద్రతకు మరింత భరోసా కల్పించడంతో పాటు, ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి దర్శనం త్వరగా, సౌకర్యవంతంగా లభించేలా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. ఏఐ ఆధారిత ప్రత్యేక మొబైల్ అప్లికేషన్, అందుబాటులో ఉన్న సేవలను పరిశీలించారు. క్యూలైన్లోని భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎంత సమయం పడుతుందో ఎప్పటికప్పుడు తెలియజేసేలా ప్రతి 200 మీటర్లకు చేస్తున్న ఏర్పాట్లతో పాటు డిజిటల్ స్క్రీన్లు, ఏఐ కెమెరాలు, డ్రోన్ల సేవలు తదితరాలపై చర్చించారు. 22 పార్కింగ్ ప్రాంతాలతో మూడు హోల్డింగ్ ఏరియాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చేస్తున్న ఏర్పాట్లతో పాటు స్మార్ట్ లడ్డూ వెండింగ్ మెషీన్ల ఏర్పాటుపైనా చర్చించారు. ఈ సందర్భంగా కె.కన్నబాబు మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, దర్శన మార్గాలు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, పారిశుధ్యం, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉచిత దర్శనాల విషయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు, భక్తులకు ప్రసాదాల పంపిణీకి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. భక్తుల భద్రత, సౌకర్యాల విషయంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణను సమన్వయం చేసేందుకు దుర్గాఘాట్ సమీపంలో 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుండగా.. క్షేత్రస్థాయి నుంచి అందే సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ, తక్షణమే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలపై కూడా వేగంగా స్పందించేలా చొరవ చూపాలన్నారు. సామాన్య భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలు, జనరల్ పబ్లిక్‌కు ప్రత్యేక దర్శనాలకు చేస్తున్న ఏర్పాట్లు, వివిధ రకాల పాస్‌ల జారీ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు బ్యాటరీ వాహనాల ఏర్పాటు, అన్న ప్రసాదం, లడ్డూ ప్రసాదం పంపిణీ తదితరాలకు చేస్తున్న ఏర్పాట్లను ఆలయ అధికారులు వివరించారు. ఖడ్గమాల, కుంకుమార్చణ, చండీహోమం సేవలకు చేస్తున్న ఏర్పాట్లను కూడా వివరించారు. అదేవిధంగా నివేదనలు, ప్రత్యక్ష, పరోక్ష సేవల గురించి వైదిక కమిటీ సభ్యులు తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పాటు ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించే విధులకు సంబంధించి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరించారు. మొత్తంమీద 20 లక్షల వరకు భక్తులు వచ్చినా ఏ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల భద్రతకు చేస్తున్న ఏర్పాట్లు, క్యూఆర్ కోడ్ ఆధారిత చైల్డ్ ట్రాకింగ్ సిస్టమ్ గురించి పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వివరించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు తదితర సౌకర్యాలకు సంబంధించి నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. అక్టోబర్ 16 మూలానక్షత్రం రోజున సాయంత్రం 4 గంటలకు గౌరవ ముఖ్యమంత్రి ఆలయానికి రానున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు ఎల్.దుర్గా ప్రసాద్, కె.రవికుమార్, ఆలయ ఈఈలు ఎల్.రమాదేవి, బి.రాంబాబు, డీవీ భాస్కర్, ఏఈవో ఎన్.రమేష్ బాబు, డా. కె.గంగాధర్, పి.చంద్రశేఖర్, వీఎంసీ చీఫ్ఇంజనీర్ పి.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.(సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్టీఆర్ జిల్లా ద్వారా జారీ)

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- 139 మందికి రూ.39.90 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం
- మానకొండూర్‌లో చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**మానకొండూర్** మండలంలోని పేదకుటుంబాల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అండగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మానకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో 27వ విడత సీఎం ఆర్ఎఫ్ చెక్కులను 139 మంది లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే దసరా సందర్భంగా మహిళలకు మరో తీపి కబురు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేకపోయిందని కవ్వంపల్లి విమర్శించారు. బతికి ఉన్నవారి పేర్లను మృతుల జాబితాలో చేర్చి రేషన్ కార్డులు తొలగించిన ఘటనలు కూడా ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతోపాటు, నిత్యావసర సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందన్నారు.139 మందికి రూ.39.90 లక్షల సాయం 27వ విడతలో మానకొండూర్ మండలానికి చెందిన 139 మంది లబ్ధిదారులకు రూ.39.90 లక్షల సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. మంజూరైన మొత్తాన్ని చెక్కుల రూపంలో లబ్ధిదారులకు అందజేశామన్నారు. గతంలో కంటే వేగంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని కూడా పెంచిందని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీవీ వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ఊటూరు, దేవంపల్లి ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాసరెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావు, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రేవెల్లి రాజలింగం, బుర్ర శ్రీధర్ గౌడ్, రామడుగు హరీష్, మీస సత్యనారాయణ, బోళ్ల మురళీధర్, గొల్లెన కొమురయ్య, బండి మల్లేషం, సాయిరి దేవయ్య, తాళ్లపల్లి నరేష్, కోంద్ర నరేష్, ఇర్ఫాన్, మాతంగి సహదేవ్, బొంగోని సునిల్, ఎన్.బాపురావు, గుడాల మహేందర్,గోళం శ్రీనివాస్ గౌడ్, డి.శ్రీనివాస్, బి.రమేశ్, నల్ల సూర్య,ముక్కెర సతీష్ కుమార్, అంజయ్య, తమిశెట్టి రాజేశ్, జీడీ శ్యామ్, చెలికంటి ఒదెలు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**మానకొండూర్** చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం మానకొండూర్ చెరువు వద్ద వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్‌తోపాటు మానకొండూర్ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు మానకొండూర్ చెరువుకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో కాంతివంతమైన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు, భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.

గజ ఈతగాళ్లను కూడా ముందస్తుగా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తులు, వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా అవసరమైన చోట వాహనాలను దారి మళ్లించాలని పోలీసు అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, ఫైర్, విద్యుత్, ఇరిగేషన్,మున్సిపల్, వైద్యఆరోగ్య తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరారు.ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బండి రాజేశ్వరి, ఎంపీడీవో వీవీ వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వర్షిణీ, ఎంపీవో సంతోష్ రావు, సీఐ శ్రీలత, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రేవెల్లి రాజలింగం, కిషన్ రావు, బుర్ర శ్రీధర్ గౌడ్, రామడుగు హరీష్, మీస సత్యనారాయణ, బోళ్ల మురళీధర్, గొల్లెన కొమురయ్య, బండి మల్లేషం, సాయిరి దేవయ్య, తాళ్లపల్లి నరేష్, కోంద్ర నరేష్, ఇర్ఫాన్, మాతంగి సహదేవ్, బొంగోని సునిల్, ఎన్.బాపురావు, గుడాల మహేందర్, జేడీ శ్యామ్, ఏగోళం శ్రీనివాస్ గౌడ్, డి.శ్రీనివాస్, బి.రమేశ్, నల్ల సూర్య,ముక్కెర సతీష్ కుమార్, అంజయ్య, తమిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**కరీంనగర్** నగర పాలక సంస్థ 7వ డివిజన్ పరిధిలోని సదాశివపల్లికి చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలకులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం సాధ్యం కాలేదని, అది కాంగ్రెస్ ప్రభుత్వానికే సుసాధ్యమైందన్నారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను అదనంగా చేర్చడం గాని, తప్పులను సవరించడం కూడా గత పాలకులకు చేతకాలేదని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా స్మార్ట్ రేషన్ కార్డులు కూడా అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీనందిని, ఎంపీడీవో వీవీ వరలక్ష్మి, తహసీల్దార్ విజయ్ కుమార్, మానకొండూర్ ప్యాక్స్ చైర్మన్ నాగిశెట్టి రాజయ్య, సీఐ శ్రీలత, 7వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి మల్లేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్ , పార్టీ నాయకులు ముద్దసాని శ్రీనివాసరెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, పెంచాల కిషన్‌రావు, మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్‌రెడ్డి, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, రేవెల్లి రాజలింగం, బుర్ర శ్రీధర్ గౌడ్, రామడుగు హరీష్, గొల్లెన కొమురయ్య, తాళ్లపల్లి నరేష్, కోంద్ర నరేష్, ఇర్ఫాన్, దూలం దేవేంద్ర, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# 119 మందికి సీఎంఆర్ఎఫ్ సాయం రూ.43.66 లక్షలు

- చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్** మండలానికి చెందిన 119 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.43.66 లక్షల ఆర్థిక సాయం మంజూరైనట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, ప్యాక్స్ చైర్మన్ గోపు మల్లారెడ్డి, నాయకులు పొన్నాల సంపత్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బిల్ల సంతోష్, అసోద శ్రీనివాస్, మామిడి అనిల్ కుమార్, బుదారపు శ్రీనివాస్, చింతల లక్ష్మారెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, గుంటి మల్లేశం, గొట్టిముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేశ్, పోతుగంటి శ్రీనివాస్, రావుల శ్రీనివాస్, రజాక్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# అల్జీమర్స్ వ్యాధి వంశ పారంపర్యంగా వస్తుందా ప్రమాదం ఎంత వరకు ఉంటుంది



అల్జీమర్స్ వ్యాధి కుటుంబంలో ఎవరికైనా ఉంటే, తమకూ అదే వ్యాధి వస్తుందేమోనన్న ఆందోళన చాలామందిలో ఉంటుంది. అయితే కుటుంబ చరిత్ర ఉన్నంత మాత్రాన అల్జీమర్స్ తప్పనిసరిగా వస్తుందని చెప్పలేం. తల్లిదండ్రులు, తోబుట్టువులు లేదా దగ్గరి బంధువుల్లో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే ప్రమాదం కొంత పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కానీ వ్యాధి వచ్చే అవకాశాన్ని జన్యువులు మాత్రమే నిర్ణయించవు. వయసు, జీవనశైలి, గుండె ఆరోగ్యం, ఇతర ఆరోగ్య పరిస్థితులు, పర్యావరణ ప్రభావాలు కూడా అల్జీమర్స్ ప్రమాదంలో కీలకపాత్ర పోషిస్తాయి. ప్రమాదం ఎప్పుడు పెరుగుతుంది.. ఆలస్యంగా వచ్చే అల్జీమర్స్‌తో సంబంధం ఉన్న ముఖ్యమైన జన్యుపరమైన అంశాల్లో ఏపీఓఈ–ఈ4 జన్యు వైవిధ్యం ఒకటి. ఈ జన్యు వైవిధ్యానికి ఒక ప్రతిని కలిగి ఉన్నవారిలో అల్జీమర్స్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రెండు ప్రతులు ఉన్నప్పుడు ఆ ప్రమాదం మరింత పెరుగుతుంది. అయితే ఏపీఓఈ–ఈ4 ఉండడం వ్యాధి నిర్ధారణకు సమానం కాదు. ఈ జన్యు వైవిధ్యం ఉన్నప్పటికీ చాలామందికి అల్జీమర్స్ రాదు. అదే సమయంలో అల్జీమర్స్ ఉన్న ప్రతి ఒక్కరిలోనూ ఈ జన్యు వైవిధ్యం ఉండాల్సిన అవసరం లేదు. అరుదుగా కనిపించే కుటుంబపరమైన అల్జీమర్స్‌లో ఏపీపీ, పీఎస్ఈఎన్1, పీఎస్ఈఎన్2 వంటి జన్యువుల్లో వచ్చే వారసత్వ మార్పులు బలమైన ప్రభావాన్ని చూపుతాయి. ముఖ్యంగా 65 ఏళ్లలోపు వయసులోనే కుటుంబంలో పలువురికి వ్యాధి కనిపిస్తే ప్రత్యేక వైద్య పరిశీలన అవసరమవుతుంది.జన్యుపరమైన ప్రమాదం అంటే.. జన్యుపరమైన ప్రమాదం అంటే వ్యాధి కచ్చితంగా వస్తుందనే అర్థం కాదు. సాధారణంగా ఆలస్యంగా వచ్చే అల్జీమర్స్‌ను ఎవరికి తప్పకుండా వస్తుందో జన్యు పరీక్ష ద్వారా నిర్ధారించలేరు. ముఖ్యంగా ఏపీఓఈ స్థితిని తెలుసుకునే పరీక్షను ప్రతి ఒక్కరికీ సాధారణ పరీక్షగా చేయించుకోవాల్సిన అవసరం లేదు. పరీక్ష ఫలితాలను కుటుంబ చరిత్ర, వయసు, ఆరోగ్య పరిస్థితులు, ఇతర ప్రమాద కారకాలతో కలిపి అర్థం చేసుకోవాలి. జన్యు పరీక్ష చేయించుకోవాలనుకునేవారు దాని ప్రయోజనాలు, పరిమితులు, మానసిక ప్రభావాల గురించి నిపుణులతో చర్చించడం అవసరం.వయస్సు అత్యంత ముఖ్యం..అల్జీమర్స్‌కు వయస్సు అత్యంత ముఖ్యమైన ప్రమాద కారకంగా కొనసాగుతోంది. వయసు పెరిగే కొద్దీ వ్యాధి వచ్చే అవకాశం పెరుగుతుంది. అయితే వృద్ధాప్యం అంటే అల్జీమర్స్ తప్పనిసరిగా వస్తుందని కాదు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం, శారీరకంగా చురుకుగా ఉండడం, సామాజికంగా, మానసికంగా చురుకుగా ఉండడం, ధూమపానానికి దూరంగా ఉండడం, తగినంత నిద్రపోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం వంటి చర్యలు మెదడు ఆరోగ్యానికి తోడ్పడతాయి. కుటుంబంలో అల్జీమర్స్ చరిత్ర బలంగా ఉన్నవారు లేదా చిన్న వయసులోనే పలువురికి ఈ వ్యాధి వచ్చిన సందర్భాలు ఉన్నవారు నిపుణులను సంప్రదించి తమ వ్యక్తిగత ప్రమాదాన్ని అంచనా వేసుకోవాలి. కుటుంబ చరిత్ర ప్రమాదాన్ని పెంచవచ్చు కానీ భవిష్యత్తును నిర్ణయించదని నిపుణులు చెబుతున్నారు.

# దీర్ఘకాలిక నొప్పులు ఉన్నవారు తేలికపాటి వ్యాయామాలు అయినా చేయాలి ఎందుకంటే



దీర్ఘకాలిక నొప్పితో బాధపడేవారు కదలికలకు దూరంగా ఉండడం సహజం. నెలలు లేదా సంవత్సరాలుగా నొప్పి కొనసాగితే విశ్రాంతి తీసుకోవడమే మంచిదని అనిపిస్తుంది. అయితే శారీరక కదలికలు పూర్తిగా తగ్గిపోతే క్రమంగా కండరాల బలం తగ్గి శరీర సామర్థ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. మెట్లు ఎక్కడం, సరుకుల సంచులు మోయడం, కుర్చీలో నుంచి లేవడం వంటి సాధారణ పనులు కూడా కష్టంగా మారుతాయి. ఇలా నొప్పి కారణంగా కదలికలు తగ్గడం, దాంతో కండరాలు బలహీనపడడం, బలహీనత వల్ల కదలికలు మరింత కష్టంగా మారడం వంటి చక్రం ఏర్పడుతుంది. అందుకే సరైన పద్ధతిలో చేసే బలవర్ధక వ్యాయామాలు కొంతమంది దీర్ఘకాలిక నొప్పి బాధితులకు ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు.వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా.. వెన్ను నొప్పి, మోకాళ్ల కీళ్ల సమస్యలు లేదా ఇతర కండరాలు, ఎముకలు, కీళ్లకు సంబంధించిన దీర్ఘకాలిక నొప్పి ఉన్నవారికి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా రూపొందించిన వ్యాయామ కార్యక్రమం శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కండరాల బలం పెరగడం వల్ల కీళ్లు, వెన్నెముకకు మెరుగైన మద్దతు లభించడంతోపాటు సమతుల్యత, కదలికలపై నమ్మకం కూడా పెరుగుతుంది. అయితే నొప్పి ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన వ్యాయామం సరిపోదు. మందులు నొప్పి నియంత్రణలో సహాయపడినా, ఎక్కువకాలం కదలికలు లేకపోవడం వల్ల వచ్చే కండరాల బలహీనతను అవి మాత్రమే పరిష్కరించలేవు.వ్యాయామం తప్పుగా చేస్తే..అయితే తప్పుగా చేసే బలవర్ధక వ్యాయామాలు నొప్పిని మరింత పెంచే అవకాశం ఉంటుంది. శరీరం తట్టుకోలేనంత బరువులు ఎత్తడం, తప్పు పద్ధతిలో వ్యాయామం చేయడం, తీవ్రతను ఒక్కసారిగా పెంచడం లేదా నొప్పి తీవ్రంగా ఉన్న సమయంలో వ్యాయామం చేయడం సమస్యలను పెంచుతాయి. అందుకే క్రమంగా తీవ్రతను పెంచడం చాలా ముఖ్యం. మొదట శరీరం తట్టుకోగలిగే స్థాయి నుంచి ప్రారంభించి, ఆ తర్వాత బరువు, పునరావృతాలు లేదా వ్యాయామ సమయాన్ని నెమ్మదిగా పెంచాలి. కొత్త వ్యాయామాల తర్వాత స్వల్పంగా కండరాల నొప్పి రావడం సాధారణమే. కానీ తీవ్రమైన లేదా నిరంతర నొప్పి, కొత్తగా నరాలకు సంబంధించిన లక్షణాలు లేదా అసలు సమస్య మరింత తీవ్రం కావడం వంటి సంకేతాలను నిర్లక్ష్యం చేయకూడదు.కదలికలను ఆపవద్దు..దీర్ఘకాలిక నొప్పి ఉందని పూర్తిగా కదలికలను ఆపాల్సిన అవసరం లేదు. అదే సమయంలో నొప్పిని పట్టించుకోకుండా బలవంతంగా వ్యాయామం చేయడం కూడా సరైన విధానం కాదు. నొప్పికి కారణం, శారీరక సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న పరిమితులను పరిగణనలోకి తీసుకుని వ్యాయామాలను ఎంచుకోవాలి. తీవ్రమైన, పెరుగుతున్న లేదా కారణం తెలియని నొప్పి ఉన్నవారు వ్యాయామాలు ప్రారంభించే ముందు వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది. అవసరాన్ని బట్టి వైద్యుడు లేదా ఫిజియోథెరపిస్ట్ సరైన కదలికలు, ప్రారంభించాల్సిన స్థాయి, వ్యాయామ తీవ్రతను క్రమంగా ఎలా పెంచాలో సూచిస్తారు. సరైన పర్యవేక్షణతో చేసే బలవర్ధక వ్యాయామాలు కండరాల బలం, శారీరక పనితీరు, కదలికలపై నమ్మకాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

# సెప్సిస్ అంటే ఏమిటి ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి దీంతో ఏమవుతుంది



ఛాతీ ఇన్ఫెక్షన్, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ లేదా కొన్ని రోజులుగా కొనసాగుతున్న జ్వరం వంటి సమస్యలు సాధారణంగా సరైన చికిత్సతో తగ్గిపోతాయి. అయితే కొన్ని సందర్భాల్లో ఇన్ఫెక్షన్‌కు శరీరం స్పందించే విధానం అదుపు తప్పి ఇతర అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. ఈ పరిస్థితినే సెప్సిస్ అంటారు. ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్న అత్యవసర పరిస్థితి. ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి చికిత్స తీసుకుంటున్నప్పటికీ పరిస్థితి మెరుగుపడకుండా మరింత క్షీణిస్తే, ఇన్ఫెక్షన్ తీవ్రత పెరిగిందా లేదా ఇతర సమస్యలు ఏర్పడ్డాయా అనే విషయాన్ని వైద్యులు మరోసారి పరిశీలించాల్సి ఉంటుంది. మొదట గుర్తించిన ఇన్ఫెక్షన్ నిజమైనదే అయినప్పటికీ, అది మొత్తం సమస్యకు కారణం కాదని నిపుణులు చెబుతున్నారు.ఎలాంటి లక్షణాలు ఉంటాయి..సెప్సిస్ ప్రారంభ దశలో లక్షణాలు సాధారణ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే కనిపిస్తాయి. అధిక జ్వరం లేదా శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా తగ్గడం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరగడం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. అలాగే అకస్మాత్తుగా గందరగోళానికి గురికావడం, ఎక్కువగా నిద్ర రావడం లేదా మెళకువగా ఉండడం కష్టంగా మారడం, చర్మం పాలిపోయినట్లు లేదా చల్లగా మారడం, కొన్ని గంటల వ్యవధిలో మూత్రం గణనీయంగా తగ్గిపోవడం, ఇన్ఫెక్షన్ తీవ్రతకు మించినట్లు అనిపించే తీవ్రమైన బలహీనత వంటి సంకేతాలను నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తిలో ఈ లక్షణాలు ఒకేసారి కనిపించినప్పుడు లేదా పరిస్థితి అకస్మాత్తుగా క్షీణించినప్పుడు అత్యవసర వైద్య సహాయం అవసరమవుతుంది. ఎవరికి ఎక్కువ ప్రమాదం..సెప్సిస్ వచ్చే ప్రమాదం అందరిలో ఒకేలా ఉండదు. నవజాత శిశువులు, వృద్ధులు, మధుమేహం లేదా మూత్రపిండాల వ్యాధి వంటి ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రోగనిరోధక వ్యవస్థను అణిచివేసే మందులు వాడుతున్నవారిలో కూడా ఇన్ఫెక్షన్ తీవ్రంగా మారే అవకాశం ఉంటుంది. డెంగ్యూ, స్క్రబ్ టైఫస్, లెప్టోస్పిరోసిస్ వంటి ఇన్ఫెక్షన్లు కూడా కొన్ని సందర్భాల్లో తీవ్రమైన అనారోగ్యానికి కారణం అవుతాయి. అయితే సెప్సిస్ ఒకే అవయవానికి లేదా ఒకే రకమైన ఇన్ఫెక్షన్‌కు పరిమితం కాదు. శరీరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పడే ఇన్ఫెక్షన్ల నుంచి ఇది అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..ఇన్ఫెక్షన్‌కు చికిత్స తీసుకుంటున్నప్పటికీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గందరగోళం, అసాధారణంగా ఎక్కువ నిద్ర, తీవ్రమైన బలహీనత, రక్తపోటు తగ్గడం లేదా మూత్రం గణనీయంగా తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే పరిస్థితిని సాధారణ ఇన్ఫెక్షన్‌లో భాగంగా భావించకూడదు. సెప్సిస్‌ను ఇంట్లోనే నమ్మకంగా గుర్తించడం సాధ్యం కాదు. .సెప్సిస్ ప్రారంభ దశలో లక్షణాలు సాధారణ ఇన్ఫెక్షన్ల మాదిరి గానే కనిపిస్తాయి. అధిక జ్వరం లేదా శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా తగ్గడం, గుండె వేగం గా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరగడం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. అలాగే అకస్మాత్తుగా గందరగోళానికి గురికావడం, ఎక్కువగా నిద్ర రావడం లేదా మెళకువగా ఉండడం కష్టంగా మారడం, చర్మం పాలిపోయినట్లు లేదా చల్లగా మారడం, కొన్ని గంటల వ్యవధిలో మూత్రం గణనీయంగా తగ్గిపోవడం, అందువల్ల అను మానం ఉన్నప్పుడు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి.అధిక జ్వరం లేదా శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా తగ్గడం, గుండె వేగం గా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరగడం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. అలాగే అకస్మాత్తుగా గందరగోళానికి గురికావడం, ఎక్కువగా నిద్ర రావడం లేదా మెళకువగా ఉండడం కష్టంగా మారడం, చర్మం పాలిపోయి నట్లు లేదా చల్లగా మారడం, కొన్ని గంటల వ్యవధిలో మూత్రం గణనీయంగా తగ్గిపోవడం, ఇన్ఫెక్షన్ తీవ్రతకు మించినట్లు అనిపించే తీవ్రమైన బలహీనత వంటి సంకేతాలను నిర్లక్ష్యం చేయకూడదు. పరిస్థితిని బట్టి యాంటీబయాటిక్స్, శరీరంలో ద్రవాలు అందించడం, ఆక్సిజన్, నిరంతర పర్యవేక్షణ వంటి చికిత్సలు అవసరమవుతాయి.

తీవ్రమైన సందర్భాల్లో అవయవాల పనితీరుకు మద్దతుగా అత్యవసర చికిత్స అవసరమవుతుంది. డెంగ్యూ, స్క్రబ్ టైఫస్, లెప్టోస్పిరోసిస్ వంటి ఇన్ఫెక్షన్లు కూడా కొన్ని సందర్భాల్లో తీవ్రమైన అనారోగ్యానికి కారణం అవుతాయి. ముఖ్యం గా ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి పరిస్థితి ఒక్కసారిగా క్షీణిస్తే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం తీసుకోవడం కీలకమని నిపుణులు తెలియ జేస్తున్నారు.

# యాదాద్రిలో రెండు యూనిట్లు బంద్



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :** దక్షిణ భారతదేశంలోనే రెండో అతిపెద్ద పవర్‌ప్లాంట్ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) సంక్షోభంలో పడింది. ఈ ప్లాంట్‌లోని రెండు యూనిట్లు బంద్ అయ్యాయి. కొంతకాలం క్రితం వరకు యూనిట్–4 బంద్ కాగా, తాజాగా యూనిట్–3లో కూడా ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో ఒక్కో యూనిట్‌లో 800 మెగావాట్ల చొప్పున మొత్తం 1,600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. నడుస్తున్న నాలుగు యూనిట్లల్లో రెండు మాత్రమే ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి. ఉత్పత్తి నిలిచిపోయిన యూనిట్లు ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్లాంట్‌లో బొగ్గు సంక్షోభం తారస్థాయికి చేరింది. ప్రస్తుతానికి ఈ ప్లాంట్‌లో కేవలం నాలుగు రోజులకు సరిపడా బొగ్గు నిల్వలే ఉన్నాయి. కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) నిబంధనల ప్రకారం 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలుండాలి. సింగరేణి నుంచి, ఒడిశాలోని నైని నుంచి బొగ్గు సరఫరా అవుతున్నా.. అది ఏ మూలకూ సరిపోవడంలేదు. బొగ్గు నిల్వలు నిండుకుంటే.. మొత్తం ప్లాంట్ మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.సింగరేణి సంస్థ నుంచి జెన్‌కోకు దీర్ఘకాలిక బొగ్గు లింకేజీ రూపంలో 28.872 మిలియన్ టన్నులు బొగ్గును కేటాయించారు. ఇందులో 14 మిలియన్ టన్నుల జీ–9 గ్రేడ్ బొగ్గును వైటీపీఎస్‌కు సరఫరా చేయాల్సి ఉన్నది. సీఈఏ నిబంధనల ప్రకారం ఈ ప్లాంట్‌కు 15.75 మిలియన్ టన్నుల జీ–9 గ్రేడ్ బొగ్గు అవసరం. కానీ, సింగరేణి జీ–13 గ్రేడ్ బొగ్గును సరఫరా చేస్తున్నది దీంతో ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గు పరిమాణం 21.45 మిలియన్ టన్నులకు చేరింది. సింగరేణి సమకూరుస్తున్న 14 మిలియన్ టన్నుల బొగ్గు మూడు యూనిట్లకు కూడా సరిపోవడంలేదు.

# ఐసీసీపై అమెరికా ఆంక్షలు




**వాషింగ్టన్, సెప్టెంబర్ 21 :** అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం (ఐసీసీ)పై విస్తృతమైన ఆంక్షలను విధించడానికి ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతున్నట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆదివారం వెల్లడించింది. దీని కారణంగా ఐసీసీకి ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడమే కాక, రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొంది. ఒక వేళ ఆంక్షలు అమలయితే అమెరికా ట్రెజరీ లైసెన్స్ లేకుండా పౌరులు కానీ, సంస్థలు కానీ ఐసీసీకి నగదు, వస్తువులు పంపడంపై నిషేధం విధిస్తారు. అమెరికా ఆంక్షలు ఆరేడు నెలల గడువు తర్వాత ఐసీసీతో లావాదేవీలను అగ్రరాజ్యం నిషేధిస్తుందని తెలిపింది.వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆదివారం వెల్లడించింది. దీని కారణంగా ఐసీసీకి ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడమే కాక, రోజువారీ కార్యకలాపాలకు ఆంక్షల కు సంబంధించిన నిర్ణయం ఈ వారం న్యూయార్క్‌లో జరగబోయే ఐరాస సాధారణ సభ సమావేశంలో కానీ, దాని తర్వాత కానీ తీసుకుంటారని రాయిటర్స్ సంస్థ తెలిపింది.

# మహిళల క్రికెట్‌లో స్వర్ణ పతకానికి
# భారత్, శ్రీలంక ఢీ

**నేటి ఉదయం 10.30గం.ల నుంచి**




**ఐచి-నగోయా(జపాన్):** ఆసియా క్రీడల మహిళల క్రికెట్లో భారత జట్టు శ్రీలంకతో తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత మహిళల జట్టు మంగళవారం జరిగే ఫైనల్లో శ్రీలంకను ఓడిస్తే మరోసారి స్వర్ణ పతకం చేజిక్కించుకోనుంది. ఈ మ్యాచ్ జపాన్‌లోని నిషిన్ కోరోగీ స్పోర్ట్స్ పార్క్‌లో జరగనుంది. క్వార్టర్‌ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారతజట్టులో ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన అద్భుత ఫామ్‌లో ఉన్నారు. బంగ్లాదేశ్‌పై షెఫాలీ కేవలం 49 బంతుల్లోనే 100 పరుగులు చేసి రికార్డు సెంచరీతో మెరిసింది. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగి 20 ఓవర్లలో 195/4 పరుగులు చేయగా.. ఛేదనలో బంగ్లాదేశ్‌ను 81 పరుగులకే ఆలౌట్ చేసి 114 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది. భారత జట్టు తరఫున ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, కెప్టెన్ హర్మాన్‌ప్రీత్ కౌర్, ఆల్ రౌండర్ దీప్తి శర్మ మ్యాచ్ విన్నర్లుగా మారనుండగా.. శ్రీలంక జట్టు పూర్తిగా వారి స్టార్ కెప్టెన్ చమరి అతపత్తుపై ఆధారపడి ఉంది. ముఖాముఖి పోరులోనూ భారత్‌దే అగ్ర స్థానం. ఇప్పటివరకు మొత్తం 32 మ్యాచులు జరగ్గా.. భారత్ 26, శ్రీలంక 5మ్యాచుల్లో విజయం సాధించాయి. ఒక మ్యాచ్ రద్దయ్యింది. ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్లోనూ ఈ రెండు జట్లు తలపడనున్నాయి. 2022 హ్యాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో స్వర్ణం గెలుచుకున్న టీమిండియా,

ఈసారి కూడా టైటిల్‌ను కొట్టాలని చూస్తోంది. ఇక భారత్, శ్రీలంక మహిళలజట్లు ఆసియా కప్ ఫైనల్లో తలపడ్డాయి. బ్యాటింగ్‌కు దిగిన నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 183 పరుగులు చేయగా.. ఛేదనలో శ్రీలంకను కేవలం 111 పరుగులకే ఆలౌట్ చేసి 72పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తెలుగు తేజం, కడపకు చెందిన శ్రీచరణి(4/20) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌లో చెలరేగి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించింది. జట్లు(అంచనా)...భారత మహిళలు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), మంధాన, షెఫాలీ వర్మ, కమిలిని, రీచా ఘోష్(వికెట్ కీపర్), ఫుల్మాలీ, దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్, శ్రీచరణి, నందిని శర్మ, క్రాంతి గాడ్.శ్రీలంక మహిళలు: ఆటపట్టు(కెప్టెన్), దిలానీ, హాసిని, హర్షిత, సమరవిక్రమ, దిల్హారీ, కరుణరత్నే, కౌషని(వికెట్ కీపర్), మిథాలీ, కవింది, చాముండి




## గురి తప్పని హిమాన్షు

20వ ఆసియా క్రీడల్లో మూడోరోజు భారత్‌కు మూడు పతకాలు దక్కాయి. షూటింగ్‌లో రజత, కాంస్యాలతోపాటు ఎంఎంఏలో మరో కాంస్య పతకం లభించింది. స్విమ్మింగ్‌లో శ్రీహరి నటరాజన్ ఫైనల్‌కు చేరగా.. పురుషుల బ్యాడ్మింటన్‌లో పురుషుల జట్టు బంగ్లాదేశ్‌ను ఓడించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో హిమాన్షు దిల్లాన్ రజత పతకాన్ని, రుద్రాంక్ష? పాటిల్ కాంస్య పతకాన్ని సాధించగా.. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్(ఎంఎంఏ)లో సుచికా తారియాల్ తృటిలో సెమీస్‌లో ఓడి కాంస్య పతకానికి పరిమితమైంది. 20వ ఆసియా క్రీడల్లో మూడోరోజు భారత్‌కు మూడు పతకాలు దక్కాయి. షూటింగ్‌లో రజత, కాంస్యాలతోపాటు ఎంఎంఏలో భారత్‌కు మరో కాంస్య పతకం లభించింది. స్విమ్మింగ్‌లో శ్రీహరి నటరాజన్ ఫైనల్‌కు చేరగా.. పురుషుల బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు బంగ్లాదేశ్‌ను ఓడించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. సోమవారం జరిగిన పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో హిమాన్షు దిల్లాన్ రజత పతకాన్ని, రుద్రాంక్ష పాటిల్ కాంస్య పతకాన్ని సాధించారు. మహిళల టేబుల్ టెన్నిస్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం సాధించింది.**కబడ్డీ జట్టు శుభారంభం** భారత పురుషుల కబడ్డీ జట్టు శుభారంభం చేసింది. గ్రూప్-ఎలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 49-24 పాయింట్ల తేడాతో ఆతిథ్య జపాన్‌ను ఓడించింది. ఎనిమిది సార్లు కబడ్డీ చాంపి యన్ భారత్ ముందు జపాన్ ఆటలు సాగలేదు. అర్ధభాగం ముగిసేసరికే భారత్ 31-9 పాయింట్లతో జపాన్‌పై స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ 40-12తో దూకుడు కనబరిచింది. ఆశూ మాలిక్, దేవాంక్ దలాల్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అయితే ఈ మ్యాచ్‌లో సీనియర్లు పవన్ సెహ్రావత్, అర్జున్ దేశ్వాల్, అస్లామ్ ఇనామ్‌దార్‌లు కొద్దిసేపు మాత్రమే బరిలోకి దిగారు. ఆశూ సూపర్ రైడ్‌తో మూడు టాకిల్ పాయింట్లు సాధించాడు. రెండో గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు రిపబ్లిక్ ఆఫ్ కొరియాతో తలపడనుంది. **పురుషుల బ్యాడ్మింటన్ క్వార్టర్స్‌కు...** బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో భారతజట్టు క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారతజట్టు 3-0తో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. తొలి సింగిల్స్‌లఓ లక్ష్యసేన్ 21-4, 21-12తో జమాన్ అయ్‌మన్‌పై, రెండో సింగిల్స్‌లఓ ఆయుశ్ శెట్టి 21-4, 21-13తో గౌరబ్ సింఘాపై, చివరి మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-15, 21-9తో జుమర్ అల్ అమిన్‌పై విజయం సాధిం చారు. మంగళవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో భారత పురుషుల జపాన్ జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ పతకం ఖాయం కానుంది.

## న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్.. రిజర్వ్ ఓపెనర్ రేసులో సాయి సుదర్శన్




ఇంటర్నెట్ డెస్క్: గాయం బారిన పడిన భారత యువ బ్యాటర్ సాయి సుదర్శన్ కోలుకున్నాడు. ఆస్ట్రేలియా-ఎ, భారత్-ఎ మధ్య మంగళవారం నుంచి ప్రారంభం కానున్న నాలుగు రోజుల ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో అతడు ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌లో రాణించి న్యూజిలాండ్ పర్యటనకు భారత టెస్టు జట్టులో రిజర్వ్ ఓపెనర్ స్థానాన్ని దక్కించుకోవాలని భావిస్తున్నాడు.సాయ్ సుదర్శన్ ఇప్పటివరకు భారత్ తరఫున ఏడు టెస్టులు ఆడాడు. అయితే ఆ మ్యాచ్‌ల్లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఇటీవల శ్రీలంక పర్యటనలో భారత్- ఎ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన అతడు రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో వరుసగా 132, 168 పరుగులు చేశాడు. అయితే ఆ తర్వాత కాలికి ఫ్రాక్చర్ కావడంతో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సుమారు ఆరు వారాల పాటు పునరావాసం తీసుకుని తాజాగా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు.**రిజర్వ్ ఓపెనర్ స్థానం కోసం..** భారత్ టెస్టు జట్టులో రిజర్వ్ ఓపెనర్ స్థానం కోసం సుదర్శన్‌తో పాటు అమన్ మొఖాడే కూడా పోటీ పడుతున్నాడు. మరోవైపు భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న దేవదత్ పడిక్కల్ శ్రీలంకలో జరిగిన గత సిరీస్‌లో రెండు సెంచరీలు సాధించి టెస్టు జట్టులో మూడో స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకున్నాడు. దీంతో సుదర్శన్ మరోసారి ఓపెనింగ్ స్థానంపై దృష్టి పెట్టాల్సి వచ్చింది. భారత టెస్టు జట్టులో వన్ డౌన్ బ్యాటర్, రిజర్వ్ స్పిన్నర్ స్థానాలపై సెలెక్టర్లు దృష్టి సారించారు. జనవరి చివరి వారం నుంచి మార్చి తొలి వారం వరకు జరగనున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నేపథ్యంలో ఈ స్థానాలకు ప్రాధాన్యం పెరిగింది.**రెండు లక్ష్యాలతో సిరీస్..** ఆస్ట్రేలియా-ఎ పర్యటనకు భారత్ రెండు ప్రధాన లక్ష్యాలతో సిద్ధమవుతోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టులు ఉండటంతో.. ఆటగాళ్లకు గాయాలు లేదా ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తినప్పుడు వారి స్థానాలను భర్తీ చేయగల ఆటగాళ్లను గుర్తించడం ఒక లక్ష్యం. అదే సమయంలో న్యూజిలాండ్‌లో జరగనున్న మూడు టెస్టుల పర్యటనకు ఎంపిక చేసేందుకు ఆటగాళ్లను కూడా సెలెక్టర్లు పరిశీలించనున్నారు.




## భారత్-జపాన్ స్పెషల్ టీ20కి టైఫూన్ ముప్పు.

ఇంటర్నెట్ డెస్క్: భారత క్రికెట్ జట్టు చారిత్రక మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. మంగళవారం భారత్, జపాన్ పురుషుల జట్లు తొలిసారి అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో తలపడనున్నాయి. 75 ఏళ్ల దౌత్య అనుబంధానికి గుర్తుగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే జపాన్‌లో టైఫూన్ ప్రభావంతో భారీ వర్షాలు, తుపాను పరిస్థితులు నెలకొనడంతో ఈ మ్యాచ్‌పై వాతావరణ ప్రభావం ఉంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.భారత్-జపాన్ స్పెషల్ టీ20 మ్యాచ్ సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ స్టేడియం కాంటో ప్రాంతంలోని టోచిగి ప్రిఫెక్చర్‌లో ఉంది. తుపాను ప్రభావం ఈ ప్రాంతంపైనా ఉండే అవకాశం ఉండటంతో మ్యాచ్ నిర్వహణపై సందేహాలు తలెత్తాయి. జపాన్ వాతావరణ సంస్థ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కొండచరియలు విరిగిపడటం, బలమైన గాలులు, వరదలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే ప్రస్తుతం వాతావరణ అంచనాల ప్రకారం.. మంగళవారం మ్యాచ్‌కు దీర్ఘకాలికంగా భారీ వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి.సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ.. మంగళవారం ఉదయం వాతావరణ పరిస్థితులు మెరుగుపడే సూచనలు ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఎండ కూడా కనిపించే అవకాశం ఉంది. అయితే మధ్యాహ్నం సమయంలో చిరుజల్లులు పడే అవకాశాలు ఉండటంతో.. మ్యాచ్‌కు స్వల్ప అంతరాయం కలగొచ్చు. అయితే మ్యాచ్ పూర్తిగా రద్దయ్యేంత స్థాయిలో సుదీర్ఘమైన భారీ వర్షం సూచనలు కనిపించడం లేదని తెలుస్తోంది.

## ఆసియా గేమ్స్: కుమారుడి టీమ్ ఓటమి..

**ఇంటర్నెట్ డెస్క్:** ఆసియా క్రీడల్లో భారత స్విమ్మింగ్ బృందానికి మరోసారి నిరాశ ఎదురైంది. నటుడు ఆర్. మాధవన్ కుమారుడు వేదాంత్ పాల్గొన్న పురుషుల 4ఇ200 మీటర్ల ఫ్రీ స్టైల్ రిలే జట్టు ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. కేవలం 0.2 సెకన్ల తేడాతో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. దీంతో వేదాంత్ తన నిరాశను సోషల్ మీడియాలో పంచుకోగా.. తండ్రి మాధవన్ స్పందించాడు.సాజన్ ప్రకాశ్, దక్షన్ శశికుమార్, అనీష్ సునీల్‌తో కలిసి వేదాంత్ భారత రిలే జట్టులో బరిలోకి దిగాడు. సోమవారం జరిగిన క్వాలిఫికేషన్‌లో భారత జట్టు 7:24.32 సెకన్లలో రేసును పూర్తి చేసి 13 జట్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. టాప్-8 జట్లు మాత్రమే ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఎనిమిదో స్థానంలో నిలిచిన ఖతార్ 7:24.10 టైమింగ్ నమోదు చేసింది. దీంతో భారత్ కేవలం 0.22 సెకన్ల తేడాతో ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. దీంతో వేదాంత్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తన నిరాశను వ్యక్తం చేశాడు. '0.2 సెకన్ల తేడాతో ఫైనల్ మిస్ అయ్యాం. భారత జట్టులో అత్యుత్తమ టైమింగ్‌కు 0.5 సెకన్ల దూరంలో ఉన్నాను' అంటూ వేదాంత్ పోస్టు చేశాడు.ఈ స్టోరీని మాధవన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. గ్రాటిట్యూడ్ ఎమోజీని జత చేశాడు. కొడుకు ప్రదర్శనపై గర్వంగా ఉన్నాననే భావాన్ని ఆయన తన స్పందన ద్వారా తెలియజేశాడు. వేదాంత్‌కు ఇంకా రెండు వ్యక్తిగత ఈవెంట్లు ఉన్నాయి. సెప్టెంబర్ 23న 200 మీటర్ల ఫ్రీస్టైల్, సెప్టెంబర్ 25న 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో అతడు పోటీపడనున్నాడు.

## చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్




**హైదరాబాద్ :** చెన్నై సూపర్ కింగ్స్ జట్టు హెడ్ కోచ్‌గా టీమ్ఇండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సీఎస్‌కే తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ప్రకటించింది. కొన్ని నెలల క్రితమే హెడ్ కోచ్ పదవి నుంచి న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వైదొలగిన సంగతి తెలిసిందే. ఆయన ఐపీఎల్ 2008వ సీజన్ నుంచి చెన్నైతోనే ఉన్నాడు.

## మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో భారత్‌కు తొలి పతకం



**హైదరాబాద్:** జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారిణి సుచికా తరిణాల్ చారిత్రాత్మక పతకం సాధించారు. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో ఆమె కాంస్య పతకం దక్కించుకున్నారు. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో సుచికా హోరాహోరీగా తలపడ్డారు. నిర్ణీత సమయం ముగిసే సరికి పోరు డ్రాగా ముగిసింది. దీంతో తక్కువ బరువు ఉన్న క్రీడాకారిణిని విజేతగా ప్రకటించే నిబంధన ప్రకారం టియోను విజేతగా ప్రకటించారు. ఇద్దరు క్రీడాకారిణుల బరువుల్లో కేవలం 700 గ్రాముల తేడా ఉండటంతో ప్రత్యర్థి విజేతగా ప్రకటించారు. దీంతో సుచికా ఫైనల్ అవకాశాన్ని కోల్పోయి కాంస్యంతో సరిపెట్టుకున్నారు. తీర్పు ప్రకటించిన వెంటనే సుచికా తీవ్ర భావోద్వేగానికి గురై మైదానంలోనే కన్నీటి పర్యంతమయ్యారు. ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ తొలిసారిగా ప్రవేశించిన ఈ ఏడాదే భారత్‌కు తొలి పతకం రావడం విశేషం. ఈ కాంస్యంతో ఆసియా క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య ఆరుకు చేరింది. ఇప్పటివరకు షూటర్లు నాలుగు రజతాలు, ఒక కాంస్య పతకం సాధించారు.హర్యానాకు చెందిన 36 ఏళ్ల సుచికా.. 12 ఏళ్ల వయసులో తనకు ఎదురైన ఈవ్‌టీజింగ్ ఘటనతో పోరాట కళలు నేర్చుకోవడం ప్రారంభించారు. ఆ సంఘటన జరిగిన 24 ఏళ్ల తర్వాత ఆమెకు ఆసియా క్రీడల్లో చారిత్రాత్మక పతకం దక్కింది. అయితే ఈ విజయం ఆమెకు ఆనందాన్ని ఇవ్వకముందే తీవ్ర భావోద్వేగానికి గురిచేసింది.

# వెంకీ 'ఆదర్శ కుటుంబం' నుంచి ఫస్ట్ సింగిల్.. డేట్ ఫిక్స్!



విక్టరీ వెంకటేశ్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాలోని మొదటి పాట 'నారాయణమ్మ'ను రేపు(సెప్టెంబర్ 22న) విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలోని 'నారాయణమ్మ' పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. ఇది ఒక మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్‌గా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ పాట ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై వెంకటేశ్ అభిమానుల్లో, సాధారణ ప్రేక్షకుల్లో భారీ ఆశలు నెలకొని ఉన్నాయి.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మరో ఇద్దరు భామలు నివేదా పేతురాజ్, డింపుల్ హయాతి ప్రత్యేక పాత్రల్లో అలరించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# ప్రారంభమైన 'ది ప్యారడైజ్' జాతర.. రికార్డు స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్!



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై నెలకొన్న భారీ అంచనాలకు తగ్గట్టే అడ్వాన్స్ బుకింగ్స్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ గురువారం సినిమా విడుదల కానుండగా, నైజాం ప్రాంతంలో ప్రారంభమైన బుకింగ్స్ పోటెత్తాయి. బుకింగ్స్ మొదలైన కొద్ది సమయంలోనే రూ.1 కోటికి పైగా గ్రాస్ వసూలైనట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.గత రాత్రి డిస్ట్రిక్ట్ యాప్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభించగా, ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. లక్షకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. దీంతో పలు షోలు ఇప్పటికే హౌస్‌ఫుల్ బోర్డులతో నిండిపోవడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయి అడ్వాన్స్ బుకింగ్స్ త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ స్థాయిలో స్పందన రావడం చూసి చిత్రబృందం హర్షం వ్యక్తం చేస్తోంది.బ్లాక్‌బస్టర్ చిత్రం 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై మొదటి నుంచి అంచనాలు ఆకాశాన్నంటాయి. ఈసారి కూడా విభిన్నమైన కథాంశంతో, బలమైన యాక్షన్ ఎలిమెంట్స్‌తో శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. నాని గత చిత్రాలకు భిన్నమైన గెటప్‌లో కనిపించనుండటం కూడా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. ఈ చిత్రంలో నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు.

సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్‌లో అభిమానుల కోసం ఓ ప్రత్యేక సర్‌ప్రైజ్ కూడా ప్లాన్ చేసినట్లు చిత్రబృందం ప్రకటించడంతో ఈ కార్యక్రమంపై కూడా ఆసక్తి పెరిగింది. రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

# పెరుగుతున్న విడాకుల సంస్కృతిపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు



దేశంలో విడాకులపై చర్చ పెరుగుతున్న వేళ నటి కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారుతున్న సంబంధాలు, ప్రేమ, పెళ్లిపై నేటి తరం ఆలోచనా విధానంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్‌లో కనిపించే జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం వల్ల దంపతులపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు.సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి, ఆనందానికి సంబంధించిన ఎన్నో పోస్టులు కనిపిస్తుంటాయి. అయితే అవి ప్రతి ఒక్కరి నిజ జీవితాన్ని ప్రతిబింబించకపోవచ్చు. అందంగా కనిపించే ఫొటోలు, సంతోషకరమైన క్షణాలనే ఎక్కువగా పంచుకోవడంతో.. సంబంధాల్లో సమస్యలు, ఇబ్బందులు బయటకు కనిపించవు. దీంతో ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం మొదలవుతుందని కాజల్ పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియా నిఘా ఎక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి విషయంపైనా వచ్చే కామెంట్లు, విమర్శలు సంబంధాలపై ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావం మహిళలపై మరింత ఎక్కువగా ఉంటుందని గతంలోనూ కాజల్ మాట్లాడారు.ప్రేమ సంబంధాల గురించి కాజల్ గతంలోనూ తన అభిప్రాయాలను వెల్లడించారు. జీవితంలో సంతోషం పూర్తిగా ప్రేమ లేదా వివాహ బంధంపైనే ఆధారపడకూడదని ఆమె చెప్పారు. భర్త గౌతమ్ కిచ్లుతో తన అనుబంధం గురించి కూడా పలు సందర్భాల్లో మాట్లాడారు.ప్రస్తుతం విడాకులపై ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. మారుతున్న అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ నేటి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని కాజల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

# శర్వానంద్ కోసం శ్రీను వైట్ల కొత్త ఫార్ములా?

టాలీవుడ్‌లో తనదైన కామెడీ మార్క్‌ను క్రియేట్ చేసుకున్న డైరెక్టర్ శ్రీను వైట్ల కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శర్వానంద్‌తో చేస్తున్న జార్జ్ క్రిష్‌పై ప్రత్యేకమైన అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈసారి శ్రీను వైట్ల తన రెగ్యులర్ ఫార్ములాకే మరో కొత్త టచ్ ఇచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో డిస్కషన్ జరుగుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా యాక్షన్, కామెడీ, హీరోయిజం చుట్టూ తన కథలను నడిపించిన ఆయన.. ఈసారి హీరో క్యారెక్టరైజేషన్‌కు సైంటిఫిక్ బ్యాక్‌డ్రాప్‌ను జోడించినట్లు తెలుస్తోంది.

జార్జ్ క్రిష్‌లో శర్వానంద్ జూనియర్ సైంటిస్ట్‌గా కనిపించబోతున్నాడట. ఈ క్యారెక్టర్ ను కేవలం హీరో చేసే జాబ్ లాగా కాకుండా, కథలోని కీలకమైన అంశంగా డిజైన్ చేసినట్లు సమాచారం. మామూలుగా కమర్షియల్ సినిమాల్లో హీరోలను పోలీస్, గ్యాంగ్‌స్టర్, బిజినెస్‌మ్యాన్, మాస్ లీడర్ వంటి పాత్రల్లో చూడటానికి అలవాటు పడిన ఆడియన్స్ కు జూనియర్ సైంటిస్ట్ క్యారెక్టర్ కొత్త అనుభూతినిచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సైంటిఫిక్ నేపథ్యాన్ని శ్రీను వైట్ల తనదైన ఎంటర్టైనింగ్ ట్రీట్‌మెంట్‌తో మిక్స్ చేస్తే ఎలాంటి సిట్యువేషనల్ కామెడీ పుడుతుందనేది ఆసక్తికరంగా మారిందిఅంతేకాదు.. ఈ సినిమా కోసం శర్వానంద్ సరికొత్త మేకోవర్‌లో కనిపించబోతున్నాడని ఇప్పటికే పలు వార్తలొచ్చాయి. సాధారణంగా మేకోవర్ అనగానే హీరో లుక్ మార్పుగా మాత్రమే చూస్తాం. కానీ జార్జ్ క్రిష్‌లో శర్వానంద్ లుక్ కూడా ఆయన పోషిస్తున్న జూనియర్ సైంటిస్ట్ పాత్ర స్వభావానికి తగ్గట్టుగానే ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. అంటే ఈ సినిమాలో హీరో ఇమేజ్ కంటే క్యారెక్టరైజేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇక శ్రీను వైట్ల గత సినిమాల్లో కనిపించిన కామెడీ ఎపిసోడ్స్, హీరో క్యారెక్టరైజేషన్, ఎంటర్టైనింగ్ ట్రాక్‌లకు ఈసారి సైంటిఫిక్ సెటప్‌ను జోడించడం ఆసక్తిని పెంచుతోంది. తన ఫార్ములాను పూర్తిగా మార్చకుండా.. అదే ఫార్ములాకు కొత్త ప్రపంచాన్ని సృష్టించారా అనే డిస్కషన్ కూడా మొదలైంది. శర్వానంద్ కోసం శ్రీను వైట్ల ఇలా ఒక కొత్త ఫార్ములాను సిద్ధం చేశారా అనేది సినిమా రిలీజయ్యే వరకు ఆసక్తికరంగా మారనుంది. ప్రస్తుతం ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఈ షెడ్యూల్‌లో శర్వానంద్, భాగ్యశ్రీ బోర్సేపై కీలకమైన లవ్ సీన్స్‌ను తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రయత్నిస్తున్నారు.



# బాలీవుడ్ నటుడికి అంతర్జాతీయ గుర్తింపు.. అనుపమ్ ఖేర్‌ను సత్కరించిన అమెరికా

ప్రముఖ బాలీవుడ్ నటుడు, విలక్షణ కళాకారుడు అనుపమ్ ఖేర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో ఆయన చేసిన సేవలను, ఆయన రంగస్థల ప్రదర్శనలను గుర్తిస్తూ అమెరికాలోని ఒహాయో రాష్ట్రం ఆయనను ప్రత్యేక ప్రకటనతో సత్కరించింది. కొలంబస్‌లో ప్రదర్శించిన 'జానే పెహచానే అంజానే' అనే నాటక ప్రదర్శనను కూడా ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఈ సంతోషకరమైన విషయాన్ని అనుపమ్ ఖేర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఒహాయో రాష్ట్రం నుంచి అందుకున్న గౌరవ పత్రాన్ని చేతిలో పట్టుకున్న ఫొటోను షేర్ చేస్తూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "ఈ ప్రత్యేక గౌరవాన్ని ఎంతో వినమ్రతతో, గర్వంతో స్వీకరిస్తున్నాను. నాలుగు దశాబ్దాల నా సినీ ప్రయాణాన్ని, మా 'జానే పెహచానే అంజానే' నాటకాన్ని గుర్తించినందుకు ఒహాయో గవర్నర్ మైక్




డీవైన్, లెఫ్టినెంట్ గవర్నర్ జిమ్ ట్రెస్సెల్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ఈ గౌరవం కేవలం తనకు మాత్రమే కాదని, తనకు గుర్తింపునిచ్చిన భారత సినీ పరిశ్రమకు, తన నాటక బృందానికి కూడా చెందుతుందని అనుపమ్ ఖేర్ తెలిపారు. "స్వదేశానికి ఇంత దూరంలో ఇలాంటి గుర్తింపు లభించడం మనసును కదిలించింది. ఈ మరువలేని గౌరవానికి ఒహాయోకు ధన్యవాదాలు. జై హింద్" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.

1984లో మహేశ్ భట్ దర్శకత్వంలో వచ్చిన 'సారాంశ్' చిత్రంతో అనుపమ్ ఖేర్ తన నట ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి 'కర్మ', 'తేజాబ్', 'రామ్ లఖన్', 'దిల్', 'హమ్ ఆప్కే హై కౌన్', 'దిల్వాలే దుల్హనియా లేజాయేంగే', 'కుచ్ కుచ్ హోతా హై', 'స్పెషల్ 26', 'ఊంచాయ్' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలలో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు.

ఆయన చివరిగా 'తన్వి ది గ్రేట్' అనే చిత్రంలో కనిపించారు. ఆటిజంతో బాధపడుతున్న ఒక యువతి తన తండ్రి కలను నెరవేర్చడానికి సైన్యంలో చేరాలనుకునే స్ఫూర్తిదాయక కథతో ఈ సినిమా తెరకెక్కింది.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com